Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 07.11.2014, శుక్రవారం

సంపుటి : 34 సంచిక : 23

పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

- భూములు ఇచ్చేదిలేదంటున్న రైతులు
- ఇవ్వకుంటే లాక్కుంటామంటున్న ప్రభుత్వం
- రైతులకు మద్దతుగా రంగంలోకి విపక్షాలు
- ఈ ఐదేళ్లు వివాదాలతోనే సరి
- అధికారులు ఉక్కిరిబిక్కిరి

# రాజుకుంటున్న రాజధాని

**ఆం**ధ్రప్రదేశ్ నూతన రాజధాని నగరంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఈస్ట్‌మన్ కలర్ సినిమా చూపిస్తున్నారు. సింగపూర్, కౌలాలంపూర్, వాషింగ్టన్, న్యూయార్క్, లాస్‌ఏంజిల్స్, టోక్యో, బీజింగ్ వంటి నగరాలను మిక్సీలో వేసి తీస్తే ఎంత అందంగా ఉంటుందో అంత అందంగా ఏపి రాజధానిని నిర్మిస్తానంటూ ప్రజలను గాల్లో తేలాడేలా చేస్తున్నాడు. ఆయన ఎంత అందమైన రాజధాని కట్టాలనుకుంటున్నాడనేది రాజధానికి ఎంపిక చేసిన ప్రాంతాన్ని చూస్తుంటేనే అర్ధమవుతుంది. రాష్ట్రంలోనే అత్యంత సారవంతమైన భూములున్న కృష్ణా, గుంటూరుజిల్లాలను రాజధానికి ఎంపిక చేయడంతోనే... ఇక అందమైన రాజధాని కలేనని అర్థమైపోయింది.

ఈ రెండుజిల్లాల్లో సారవంతమైన భూములున్నాయి. ఏడాదిలో ఒకటికి మూడుకార్లు పండుతాయి. రైతులకు, కూలీలకు చేతినిండా పనివుంటుంది. గుంటూరుజిల్లాలో అయితే పత్తి, మిరప వంటి వాణిజ్య పంటలు ఎక్కువ. ఈ పంటలను ఆధారంగా చేసుకునే ఇక్కడ భారీఎత్తున కాటన్‌మిల్లులు, మిర్చియార్డ్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లు వెలిసాయి. ఈ పొలాలను రాజధానికి వాడుకుంటే ఈ పరిశ్రమల మనుగడ ప్రశ్నార్ధకమవుతుంది. చాలా మందికి ఉపాధిపోతుంది.

చంద్రబాబు మాత్రం ఈ రెండు జిల్లాల పరిధిలోనే రాజధాని పెట్టాలనే పంతంతో ఉన్నాడు. అందుకు ఓ కమిటీని వేశాడు. రాజధానికి ప్రాథమికంగా 30వేల ఎకరాల వరకు భూములు కావాల్సి ఉంటుంది. భూసేకరణ చేయాలంటే ప్రభుత్వానికి తడిసి మోపెడవుతుంది. విభజన ద్వారా రాష్ట్రానికి అప్పుల చిప్ప మిగిలింది. ఒక్క సెంటుభూమిని కూడా కొనే పరిస్థితి లేదు. ఇక్కడ భూములు కొనాలన్నా అలివయ్యే పని కాదు. మొన్నటిదాకా లక్షల్లో వున్న భూములు రాజధాని ప్రకటించాక కోట్లలోకి చేరాయి. రైతులు ఈ ధర కట్టి ఇవ్వనిదే ఎందుకిస్తారు. ప్రభుత్వం భూసమీకరణకే

(మిగతా 10వ పేజీలో)

# సుందర సింహపురికి శ్రీకారం

- ట్రంకురోడ్డు విస్తరణకు వెంకయ్య పట్టు
- అదే స్ఫూర్తితో ముందుకుపోతున్న కమిషనర్



## వీరికి ఓట్లతో పనిలేదు

**రా**జకీయాలకు–అభివృద్ధికి, ఓట్లకు– అక్రమాలకు లింకు పెడితే ఎక్కడా అభివృద్ధి జరగదు. ఏ అక్రమం కూడా ఆగదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆరున్నర దశాబ్దాల తర్వాత కూడా భారతదేశం ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలోనే ఉందంటే దానికి కారణం ఓటుబ్యాంకు రాజకీయాలే! ఇలాంటి ఓటు బ్యాంకు రాజకీయాల వల్లే నెల్లూరు నగరం కూడా అభివృద్ధిలో వెనుకబడిపోయింది.

(మిగతా 10వ పేజీలో)

## లాయర్ ఆధ్వర్యంలో... బాలల దినోత్సవం

(వివరాలు 5వ పేజీలో)

## రొట్టెల పండుగతో నెల్లూరు నగరం...
# భక్తజనసాగరం



3లో



# ఇక ఇరకంకు టైమొచ్చింది



**పులికాట్ సరసులో 'ఇరకం' ఒక దీవి. ఇరకం అంటే ఇంతకుముందు నరకం అనేవాళ్లు. ఇప్పుడు అదే స్వర్గం కాబోతుంది. పర్యాటక రంగంలో ముందడుగు వేయబోతోంది.**

ఆంధ్రా-తమిళ నాడుల మధ్య విస్తరించిన పులికాట్ సరస్సులో 'ఇరకం' దీవి వుంది. ఇది ఒక గ్రామం. సూళ్లూరు పేట నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఇరకం దీవికి రోడ్డు వసతి లేదు. రోడ్డు వేయడానికి అవకాశం కూడా లేదు. ఇరకం గ్రామ ప్రజలు తమ అవసరాల కోసం సూళ్లూరుపేట, తడ, ఇంకా ఇతర ప్రాంతాలకు రావాలన్నా తిరిగిపోవాలన్నా పడవలే దిక్కు. బాహ్య ప్రపంచానికి ఈ దీవి దూరంగా వుండేది. ఈ దీవిలో ఎక్కువమంది మత్స్యకారులే! నాగరికతకే కాదు అభివృద్ధికి సైతం దూరంగా వున్న ఈ దీవికి పర్యాటక పరంగా మహర్ధశ పట్టనుంది. ఇరకంను టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు బ్రిటన్‌కు చెందిన కంపెనీలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. ముఖ్యంగా ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు 'ఇరకం'ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుండడం చర్చనీయాంశంగా వుంది. ఎవరి ఇంట్రస్ట్ ఏదైనా అభివృద్ధి జరగాలనే అందరూ కోరుకునేది.

ఇరకంలో టూరిజం అభివృద్ధికి సంబంధించి భూసర్వే కూడా పూర్తయ్యింది. నాయుడుపేట ఆర్డీఓ దీనిపై దృష్టిపెట్టారు. ఈ దీవిలో కొంతవరకు ప్రభుత్వ భూములుండగా ఇంకొన్ని భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి. ప్రైవేట్ భూములను కూడా ఇక్కడ సేకరించాల్సి వుంది. ఇరకంలో రిసార్ట్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఉద్యానవనాలు, మ్యూజియం, బోట్‌షికారు వంటివి పెడతారు. తడ, బి.వి.పాలెం వంటి ప్రాంతాల నుండి ఇరకంకు బోట్‌లను ఏర్పాటు చేస్తారు. పర్యాటకులకు పడవ ప్రయాణం అనుభూతితో పాటు ఇరకంలో అన్ని సౌకర్యాలు ఉంటాయి కాబట్టి ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఇక్కడ పర్యాటక రంగం అభివృద్ధి చెంది పర్యాటకుల సంఖ్య పెరిగితే స్థానికంగా వ్యాపారాలు అభివృద్ధి చెంది ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది.

సింగపూర్, థాయ్‌లాండ్ వంటి దేశాలు ఇలాంటి దీవులను భూతద్దంలో చూపించే పర్యాటకపరంగా కోట్ల రూపాయలు గడిస్తున్నాయి. ఇరకం లాంటి దీవి వారి దేశంలో ఉండుంటే ఇదివరకే దాని మీద కోట్లు సంపాదించుంటాయి. ఇప్పటికైనా మన ప్రభుత్వాలు పర్యాటక అభివృద్ధి పై దృష్టి పెట్టినందుకు సంతోషిద్దాం.

## వెంకటగిరిలో మద్యం గొడవ



వెంకటగిరిలో మద్యం వ్యాపారులకు స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కొరగాని కొయ్యలా తయారయ్యాడు. ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మాలని మద్యం వ్యాపారులపై ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చారు. కాని మద్యం వ్యాపారులు ఎమ్మార్పీ రేటు మీద 20 నుండి 30రూపాయలు పెంచి అమ్ముతున్నారు. దీంతో ఎమ్మెల్యే ఈ వ్యవహారంపై ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే బెల్టు షాపులు కూడా ఎత్తేయించాలంటూ ఒత్తిడి తెచ్చారు. ఎమ్మార్పీ ధరలకు మద్యం అమ్మడం, బెల్టుషాపులను ఎత్తేయడం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు. కాని ఈ రెండూ కఠినంగా అమలైతే మద్యం వ్యాపారులు నెత్తిన గుడ్డేసుకునే పరిస్థితి వుంది.

ఎమ్మెల్యే వ్యవహారశైలి కొందరు తెలుగుదేశం నాయకులకు కూడా మింగుడుపడడం లేదు. కాంగ్రెస్, వైకాపా వారితో పాటు తెలుగుదేశంకు చెందిన నాయకులు మద్యం వ్యాపారంలో ఉన్నారు. నీ మొండితనంతో మేం నష్టపోతామని వాళ్లు మొరపెట్టుకుంటున్నా ఎమ్మెల్యే మాత్రం గట్టిగానే నిలబడినట్లు తెలుస్తుంది.

## అటవీశాఖలో అక్రమార్కులు

నెల్లూరుజిల్లా ఉదయగిరి మండలం పెద్దిరెడ్డిపల్లి అటవీప్రాంతంలో ఎర్రచందనం దుంగలు నిల్వ ఉంచినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గత శుక్ర, శనివారాల్లో ప్రత్యేక పోలీసు బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నిల్వచేసిన ఎర్రచందనం దుంగలు బయటపడినట్లు ప్రచారం జరుగుతోంది. ఎర్రచందనం అక్రమరవాణాలో అటవీ అధికారుల పాత్రపై పోలీసుల అదుపులో ఉన్న ఓ వ్యక్తి సమాచారం ఇవ్వడంతో అటవీశాఖలోని అక్రమార్కుల భాగోతం బయటపడే అవకాశం వుంది. భైరవకోన కొండల్లో ఉన్న ఎర్రచందనాన్ని పరిసర ప్రాంతాలకు చెందిన కొంతమంది అటవీశాఖ అధికారులతో కుమ్మక్కై రెండేళ్లుగా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం. పెద్దిరెడ్డిపల్లి, గొల్లపల్లి పరిసర గ్రామాలకు చెందిన పలువురు నేతలు, అటవీశాఖ అధికారుల పరస్పర అవగాహనతో ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. వరికుంటపాడు ఎస్సై కె.కొండపనాయుడు అక్రమరవాణా సంబంధం వున్న వ్యక్తుల వివరాలను సేకరించి పూర్తిస్థాయిలో స్పష్టత ఇచ్చే అవకాశముంది.

## ముగిసిన సూళ్లూరుపేట కో-ఆప్షన్ ఎన్నిక

సూళ్లూరుపేట కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక ఇటీవల పూర్తయ్యింది. మొత్తం మూడు కో-ఆప్షన్ స్థానాలకు గాను తెలుగుదేశం రెండు, కాంగ్రెస్ ఒక స్థానాన్ని చేజిక్కించుకున్నాయి. జనరల్ స్థానానికి తెలుగుదేశం అభ్యర్థి కొలగాని మార్కండేయులు, మైనార్టీ స్థానానికి టీడీపీ అభ్యర్థి ఎస్.కె.హుస్సేన్, మైనార్టీ మహిళ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.స్వాతి ఎన్నికయ్యారు. కాంగ్రెస్, స్వతంత్రసభ్యుల మద్దతుతో తెలుగుదేశం రెండు, అలాగే తెలుగుదేశం మద్దతుతో కాంగ్రెస్ ఒకటి దక్కించుకున్నాయి. వైకాపా అభ్యర్థులను గెలిపించడానికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గట్టిగా పోరాడినా ఫలితం దక్కలేదు.

## అర్హులకు పింఛన్లు తొలగించారు

### వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

అర్హులకు పింఛన్లు తొలగించి ఆ మొత్తంలో నుంచి మిగిలిన వారికి పింఛన్లు ఇస్తున్నారని వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం తలమంచి గ్రామంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పింఛను మొత్తంలో రూ.700 కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని, రూ.200పింఛను దివంగత ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి మంజూరు చేశారన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చేది కేవలం రూ.100లు మాత్రమేనని పేర్కొన్నారు. అర్హులైన వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పింఛను కోల్పోయి లబోదిబోమంటున్నారన్నారు. ఉపకారవేతనాలు, ఫీజురీయంబర్స్‌మెంట్ పై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేసి అక్రమకేసులు బనాయించడం హేయమైన చర్యని విమర్శించారు. ఈ సమావేశంలో వైయస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

### కండలేరు నుంచి
## నీటి విడుదల పెంపు

నెల్లూరుజిల్లా కండలేరు జలాశయం నుంచి చెన్నై, వెంకటగిరి, తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి, చిత్తూరు, నెల్లూరు తదితర ప్రాంతాల్లోని ప్రజల దాహార్తి తీర్చేందుకు విడుదల చేస్తున్న కండలేరు జలాలను ఆదివారం నుంచి 1200 క్యూసెక్కులకు పెంచినట్లు కండలేరు ప్రాజెక్టు డిఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. కండలేరు జలాశయంలో నీటిమట్టం పెరగడంతో చెన్నై వాసుల దాహార్తి తీర్చేందుకు కండలేరు జలాశయం హెడ్‌రెగ్యులేటర్ ద్వారా శనివారం వరకు విడుదల చేస్తున్న వెయ్యి క్యూసెక్కుల నీటిని ఆదివారం నుంచి 1200క్యూసెక్కులకు పెంచి విడుదల చేస్తున్నారు. కండలేరు జలాశయం నుంచి ప్రతి ఏడాది చెన్నైకి 12 టిఎంసిల నీరు విడుదల చేయాల్సివుంది.

### కావలి జవహర్ భారతికి
## ఓవరాల్ ఛాంపియన్‌షిప్

నెల్లూరుజిల్లా స్థాయి అంతర్‌కళాశాలల ఆటల పోటీల్లో నెల్లూరుజిల్లా కావలి జవహర్ భారతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. నెల్లూరుజిల్లా కొడవలూరు మండలంలోని చంద్రశేఖరపురం గిరిజన బాలికల గురుకుల కళాశాలలో జరుగుతున్న జిల్లాస్థాయి ఆటల పోటీలు 1వ తేదీతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో డివీఈవో బాబుజాకబ్, ఐటిడిఏ పివో వై.వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జ్ డిఇఓ ఉష, ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ చైతన్యమురళి, ఐటిడిఏ అభివృద్ధి అధికారి వరప్రసాద్, పిఈటీల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శి కృష్ణారెడ్డి, సనత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గంటాకే మంట పెట్టారు

రాష్ట్ర మానవవనరుల శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు సంబంధీకుల భూములకే నకిలీ పట్టాలు సృష్టించి ఋణాలు పొందిన ఘటికులు మన జిల్లాలోని కొండాపురం మండలంలో వెలుగులోకి వచ్చారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో గంటా శ్రీనివాసరావు మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలోనే కొండాపురం మండలం పొట్టిపల్లిలో సుమారు 60ఎకరాల భూములను గంటా బంధువులు కొన్నారు. స్థానికంగా వున్న కొందరు ఆ భూములకే నకిలీ పట్టాలు పుట్టించారు. వాటిని గరిమెనపెంట సహకార సంఘంలో పెట్టి 17లక్షల రూపాయలు, యర్రబల్లి యూనియన్ బ్యాంకులో పెట్టి 10లక్షల రూపాయలు ఋణం పొందారు. అలాగే కలిగిరి మండలం అన్నలూరు ఎస్‌బిఐలోనూ లోన్ పొందారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదులందాయి. దీంతో కావలి ఆర్డీవో విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

## ఉత్తరకాలువ ద్వారా సాగునీరు

### నెల్లూరు ఎంపి మేకపాటి

నెల్లూరుజిల్లా సోమశిల ఉత్తరకాలువ ద్వారా ఏఎస్‌పేట మండలంలోని చెరువులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 1వ తేదీ నెల్లూరుజిల్లా అనుమసముద్రంపేట మండలంలోని రాజవోలు చెరువుకు నీరు వస్తున్న పరిస్థితిని నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, వైయస్సార్‌సిపి ఏఎస్‌పేట కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులు వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సోమశిల ఉత్తరకాలువ ద్వారా సాగునీరు అందించి ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అల్లారెడ్డి సతీష్‌రెడ్డి, తూమాటి దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు హామీలను నిలబెట్టుకోవాలి

రైతులకు సాగునీరు అందించడంలో నీటి పారుదలశాఖ అధికారులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, నాటకాలు ఆడితే సహించేదిలేదని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ నెల 1వ తేదీ నెల్లూరుజిల్లా సంగం సమీపంలోని సంగం ఆనకట్ట నుంచి కనుపూరు కాలువకు సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిపారుదల సమావేశంలో ప్రజాప్రతినిధులకు అధికారులు ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవాలన్నారు. 500క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సిన కనుపూరు కాలువకు అధికారుల నిర్లక్ష్యంతో 50 నుంచి 200క్యూసెక్కుల లోపే నీటి విడుదల చేయాల్సి వచ్చిందన్నారు. కనుపూరు కాలువకు నీటి విడుదల వల్ల 85చెరువులకు సాగునీరందుతుందన్నారు. నెల్లూరు చెరువుకు నీరు అందించే విషయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు సాగునీరు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నెల్లూరు చెరువుకు నీరు అందించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదలశాఖ డిఇ షమీవుల్లా, ఏఇ రమేష్, సంగం ఆనకట్ట జేఇ శివకుమార్‌రెడ్డి, సిపిఎం నాయకులు చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓ పనైపోయింది

### ముగిసిన ఆక్రమణల తొలగింపు

వివాదాలు, ఆందోళనల మధ్య వెంకటగిరి పట్టణంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం పూర్తయ్యింది. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కౌన్సిల్, అధికారులంతా ఒకే తాటిపై నిలిచి ఈ తతంగాన్ని పూర్తి చేశారు. ఆక్రమణల తొలగింపు సమయంలో ఆందోళనలు జరిగాయి. పలుకుబడి ఉన్నోళ్ల జోలికి పోకుండా సన్నోళ్ల ఆక్రమణల జోలికొచ్చారనే ఆరోపణలు వినవచ్చాయి. జిల్లా కలెక్టరే స్వయంగా జోక్యం చేసుకుని ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని ఆదేశించడంతో ఈ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చినట్లయ్యింది. ఆక్రమణల తొలగింపు పూర్తయ్యాక ఇప్పుడు రోడ్లు విశాలంగా కనిపిస్తున్నాయి. కాకపోతే చాలా మంది బ్రతుకుదెరువు కోల్పోయారు. షెడ్లు, టెంట్లు వేసుకుని చిన్నచిన్న వ్యాపారాల చేసుకుంటున్న వాళ్లు రోడ్డునపడ్డారు. వాళ్లకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపిస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చివున్నారు. ఆక్రమణలను తొలగించి రోడ్లను విస్తరించడం ఎంత ముఖ్యమో, ఆ రోడ్డులో ఇంతకాలం వ్యాపారాలు చేసుకుంటూ బ్రతుకుతున్న వారికి ఉపాధి మార్గం చూపించడం కూడా ముఖ్యమే. కాబట్టి, ప్రభుత్వమే నీడ కోల్పోయిన వారికి ఓ మార్గం చూపించాలి.



## రొట్టెల పండుగతో నెల్లూరు నగరం...

# భక్తజనసాగరం



నెల్లూరు దర్గామిట్టలోని బారాషాహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఈ నెల 4వతేదీ నుంచి 7వతేదీ వరకు నాలుగురోజుల పాటు వైభవంగా జరిగింది. ఈ పండుగ కోసం దేశం నుండే కాకుండా విదేశాల నుండి కూడా భక్తులు పాల్గొన్నారు. మొహరంకు మూడవరోజున జరుపుకునే ఈ పండుగ గత కొన్నేళ్ళుగా జరుపుకుంటున్నారు. దర్గాతో పాటు పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రజలకు అవసరమైన సామాగ్రి కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేశారు. రొట్టెల పండుగలో వివాహం, వ్యాపారం, విద్య, సంతానం, సౌభాగ్యం, ఆరోగ్యం వంటి రొట్టెలను అందిపుచ్చుకున్నారు. మొదటిరోజైన మంగళవారం దర్గాలో హహదత్ నిర్వహించారు. 12మంది వీరులు అమరులైన దినం అయినందున ఆ షహిబ్‌లను స్మరించుకుంటూ రెండురోజులు ఉపవాసదీక్షను భక్తులు చేపట్టారు. బుధవారం రాత్రి 12గంటల నుండి తెల్లవారుజామున 3గంటల వరకు గంథమహోత్సవం వైభవంగా జరిగింది. అమీనియా మసీదు నుంచి 12బిందెలతో గంథాన్ని తీసుకువచ్చి మొదటి గంధాన్ని గుర్రంపై సవారి చేయించి తీసుకురాగా, 11గంథాల బిందెలను నడకతో మేళతాళాలు, భాజాభజంత్రీలు, తప్పెట్లతో దర్గాకు తీసుకువచ్చారు. కడప పెద్దదర్గా పీఠాధిపతి అలీపుల్లా హుస్సేని ఆధ్వర్యంలో దర్గాలో గంథ మహోత్సవాన్ని నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. దర్గా ప్రాంగణంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. మహిళా భక్తులకు స్నానపుగదులు, మొబైల్ టాయిలెట్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. భక్తులు ఇబ్బందులకు గురికాకుండా నెల్లూరు చెరువు వద్ద వివిధరకాలైన రొట్టెలకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. రాష్ట్ర మునిసిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ రొట్టెల పండుగ నాలుగు రోజుల పాటు దర్గా ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాదాపు 7లక్షలకుపైగా భక్తులు రొట్టెల పండుగలో పాల్గొన్నట్లు సమాచారం.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ అజీజ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇక రొట్టెలపండుగ దర్గా కమిటి ఛైర్మెన్ సయ్యద్ ఫయాజుద్దీన్, వక్ఫ్‌బోర్డ్ ఇన్స్‌పెక్టర్ ఆడిటర్ యస్.కె. హైదర్‌బాషాలు అనుక్షణం దర్గా వద్దే వుండి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా శక్తివంచన లేకుండా కృషి చేశారు.

## బతికున్న మనిషికి డెత్‌సర్టిఫికేట్

ఎన్నో అవినీతి అక్రమాలకు కేంద్రంగా నిలిచే నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం మరో ఆణిముత్యం లాంటి సంఘటనను తన కీర్తికిరీటంలో చేర్చుకుంది. కాసులకు కక్కుర్తిపడి బ్రతికున్న మనిషికి డెత్‌సర్టిఫికేట్ ఇవ్వడం ద్వారా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ నెల్లూరు నగరపాలక సంస్థ కీర్తిప్రతిష్టలను మరింత పెంచాడు. అందె రాఘువేంద్రరావు అనే వ్యక్తికి 50వేల రూపాయలు లంచం తీసుకుని అతని పేరుతోనే డెత్ సర్టిఫికేట్ మంజూరు చేశారు. నగరంలో ఇది పెద్ద సంచలనం రేకెత్తించింది. నెల్లూరు కార్పొరేషన్ పరువు పోయింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో మున్సిపల్ కమిషనర్ చక్రధర్‌బాబు దీనిపై విచారణ జరిపించి హెల్త్‌ఆఫీసర్ వెంకట రమణను సస్పెండ్ చేశారు.




# మంత్రి చేతికి రత్నం విరాళం

డా॥ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు కలిసి హుద్‌హుద్ ఉత్తరాంధ్ర తుఫాన్ బాధితుల సహాయార్థం ఇచ్చిన విరాళం రూ.4,35,000/-ను డా॥ కిషోర్స్ రత్నం స్కూల్స్ తరపున కె.వి.రత్నం మరియు ఏ.పి.ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకుడు చాట్ల నరసింహారావు ద్వారా మున్సిపల్‌శాఖామాత్యులు పి.నారాయణకి చెక్కు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ శాఖామాత్యులు పి.నారాయణ విరాళం ఇచ్చిన డా॥ కిషోర్స్‌రత్నం స్కూల్స్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్ట్స్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామమూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, అడ్మినిస్ట్రేటర్ సురేష్ పాల్గొన్నారు.


## 84వ జయంతి



జననం: 08-11-1930 | మరణం: 18-01-1995

## కీ. శే.॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు

వ్యవస్థాపకులు

లాయర్

తెలుగు వారపత్రిక

## 'ప్రభా'తం

# 'గత్యంతర' ఎన్నికలు



*ఇప్పుడే కాదు, ఎప్పుడైనా ఈ పార్టీకైనా పరిపాలన నేరుగా చేపట్టేందుకు అవసరమైన మెజార్టీ రాకుంటే వచ్చే పరిస్థితి ఇదే. ఏ పార్టీకైనా సరే, స్పష్టమైన మెజారిటీ వస్తేనే ఇలాంటి సమస్యలు రాకుండా నివారించవచ్చు. ఎన్నికలు జరిగినప్పటికీ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రాజకీయాల్లో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడడాన్ని ఎవరూ కోరుకోరు.*

దాదాపు ఎనిమిది నెలల రాజకీయ అనిశ్చిత పరిస్థితి నుంచి ఢిల్లీకి విముక్తి లభించేందుకు మార్గం సుగమమైంది. ప్రధాన రాజకీయపార్టీలైన ఆమ్ ఆద్మీ, బిజెపిలు రెండూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనాశక్తత వ్యక్తం చేయడం, మళ్లీ ఎన్నికలు జరిపేందుకు ఆసక్తి చూపడంతో..ఇక ఎన్నికలు తప్ప మరో గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీ అసెంబ్లీని రద్దు చేసేందుకు అక్కడి లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు చేయడం, తర్వాత ఆ మేరకు కేంద్రమంత్రివర్గం కూడా రాష్ట్రపతికి సిఫార్సు చేయడంతో ఇక ఎన్నికలు జరిపేందుకు రంగం సిద్ధం కానుంది. దీంతో ఢిల్లీలో మళ్ళీ ఎన్నికల సందడి రానుంది.

ఎన్నికల్లో ఏ పార్టీకి విస్పష్టమైన మెజారిటీ లభించనప్పుడు ఎదురయ్యే స్థితి ఇది. 70 స్థానాలు వున్న ఢిల్లీ అసెంబ్లీకి గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటైనా, ఆ తర్వాత రెండు నెలలకే ఆ ప్రభుత్వం మనుగడ సాగించలేకపోయిన నేపథ్యంలో, పదవి నుంచి వైదొలగుతున్న సందర్భంలో కేజ్రీవాల్ అసెంబ్లీ రద్దుకు సిఫార్సు చేశారు కూడా. ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజార్టీ వస్తేనే పరిపాలన సజావుగా సాగుతుందని ఆయా పార్టీల ఉద్దేశం. అందువల్ల, తిరిగి ఎన్నికలు నిర్వహించి ప్రజల తీర్పు కోరాలని అటు ఆమ్‌ఆద్మీ, ఇటు బిజెపి, కాంగ్రెస్‌పార్టీలు కోరడంతో ఎన్నికలు నిర్వహించాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. దాదాపు గత పదిహేనేళ్ళుగా ఢిల్లీలో ఏకఛత్రాధిపత్యం వహించిన కాంగ్రెస్ పార్టీ, మొన్నటి ఎన్నికల్లో చతికిలపడిపోవడం, కొత్తగా వచ్చిన ఆమ్‌ఆద్మీ పార్టీ అక్కడ విజయకేతనం ఎగురవేయడం అందరికీ తెలిసిందే. ఈ ఎన్నికల్లో బిజెపి పోటీచేసి సాధారణ మెజారిటీకి నాలుగు స్థానాలు వెనుకబడిపోయింది. కాంగ్రెస్ 8 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఇక్కడ ఏ రెండు పార్టీలైనా ఏకమైతే తప్ప ప్రభుత్వం ఏర్పాటు చేయలేని స్థితి ఏర్పడడంతో, ఆయా పార్టీలు ఏకాభిప్రాయానికి రాకపోవడంతో ఎన్నికలు తప్పనిసరయ్యాయి. అటు ఆమ్‌ఆద్మీ కానీ, ఇటు బిజెపి కానీ పూర్తిస్థాయి మెజార్టీ సాధించాలనే లక్ష్యంతోనే వున్నాయి. అలా కాక, ఇతరత్రా ప్రత్యామ్నాయమార్గాలు పార్టీల ప్రతిష్టకు ఇబ్బంది కలిగిస్తాయనే అభిప్రాయం ఆయా పార్టీల్లోనూ కనిపిస్తోంది. బిజెపికి 32 మంది సభ్యులున్నప్పటికీ, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ముగ్గురు ఎంపీలుగా ఎన్నిక కావడంతో, ప్రస్తుతం ఇక్కడ బిజెపికి 29 స్థానాలే వున్నట్లయింది. ఈ మూడు స్థానాల్లో ఒకవేళ తిరిగి బిజెపి విజయం సాధించినప్పటికీ, నేరుగా ప్రభుత్వం ఏర్పాటుచేసేంత సంఖ్యాబలం బిజెపికి లేదు. సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఢిల్లీకి సంబంధించి ఏడు లోక్‌సభ స్థానాల్లోనూ విజయకేతనం ఎగురవేయడం బిజెపి వర్గాల్లో మరింత స్థైర్యాన్ని కలిగించింది. తక్కువ బలంతో తకరార్లు పడేకంటే, పూర్తిస్థాయిలో విజయం సాధించి పాలనా పగ్గాలు చేపట్టడం వల్లనే సుపరిపాలన సాధ్యమవుతుందని బిజెపి భావిస్తోంది. దేశవ్యాప్తంగా బిజెపికి అఖండ విజయం చేకూర్చిపెట్టి ప్రధాని పదవిని అధిష్టించిన నరేంద్రమోడీకి ప్రజల నుంచి అనూహ్యమైన ఆదరణ కనిపించడంతో, ఢిల్లీ బిజెపిలోనూ మరింత ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. ఈ సారి ఎన్నికలంటూ జరిగితే విజయం తప్పక బిజెపిదే అవుతుందని ఆ పార్టీ ధృఢంగా విశ్వసిస్తోంది. ఆమ్ ఆద్మీలోనూ ఇదే నిశ్చయం తొలినుంచీ కనిపిస్తోంది. ఢిల్లీలో బిజెపికి తొలి నుంచి నాయకత్వ సమస్య వుండడం బిజెపి వర్గాల్లోనూ చర్చనీయాంశంగా వుంది. మంచి నాయకత్వంతో పురోగమించగలిగితే విజయం దానంతటదే వెనువెంట వస్తుందనేందుకు ప్రధాని మోడీయే ఒక ఉదాహరణ. ప్రజల్లో విశ్వాసం కల్పించడం, ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేయగలరనే నమ్మకం ప్రజల్లో కలిగించడం, ఆ మేరకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయడం, ప్రజల ఆశలు ఆకాంక్షలకు తగ్గట్టుగా సుపరిపాలనను అందించడం..ఇవన్నీ ఏ నాయకులైనా, నాయకత్వమైనా తక్షణం చేపట్టాల్సిన అంశాలు. ప్రజల బాధలను పట్టించుకోని నాయకులను ప్రజలు పట్టించుకోరనే కఠోరవాస్తవం గత ఎన్నికల్లోనే, అందులో ఢిల్లీలో కూడా రుజువైంది. ఏళ్ళ తరబడి పాలించినా, చివరికి ప్రజాతీర్పుతో పేద్ద వటవృక్షమంతటి కాంగ్రెస్‌పార్టీ ఇక్కడ నిలువునా కుప్పకూలిపోయింది. ఆ పార్టీకి చెందిన మహామహా నాయకులే ఖంగుతిని చతికిలబడిపోయారు. అటు ఆమ్ ఆద్మీ, ఇటు బిజెపిల ధాటికి కాంగ్రెస్ ఘోర పరాజయం చవిచూసింది. బిజెపి 31 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరిస్తే, కాంగ్రెస్ కేవలం ఎనిమిది స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సివచ్చింది. ఆమ్‌ఆద్మీ 28 స్థానాల్లో విజయఢంకా మోగించి, రెండవ అతిపెద్ద పార్టీగా ఏర్పడినా, 8 స్థానాలున్న కాంగ్రెస్ మద్దతును కూడగట్టుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జాతీయ రాజకీయాల్లో సైతం ఎంతో సంచలనం సృష్టిస్తూ ఆమ్‌ఆద్మీ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పీఠం అధిష్టించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో, జన్‌లోక్‌పాల్ బిల్లును ఆమోదించడానికి బిజెపి, కాంగ్రెస్ నిరాకరిస్తున్నాయంటూ ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో, ఇప్పుడు ఢిల్లీలో మళ్ళీ ఎన్నికలు రానున్నాయి. ఇప్పుడే కాదు, ఎప్పుడైనా ఈ పార్టీకైనా పరిపాలన నేరుగా చేపట్టేందుకు అవసరమైన మెజార్టీ రాకుంటే వచ్చే పరిస్థితి ఇదే. ఏ పార్టీకైనా సరే, స్పష్టమైన మెజారిటీ వస్తేనే ఇలాంటి సమస్యలు రాకుండా నివారించవచ్చు. ఎన్నికలు జరిగినప్పటికీ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రాజకీయాల్లో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడడం, అది ఆయా ప్రాంతాల ప్రజలపై ప్రభావం చూపడం ఎవరూ కోరుకోరు. ఏ పార్టీకైనా స్పష్టమైన మెజార్టీ వున్నప్పుడే, మళ్ళీ మళ్ళీ ఎన్నికల నిర్వహణకు అయ్యే భారీ వ్యయభారాన్ని కూడా నివారించుకోవచ్చు. ఇది నాయకులే కాదు..అందరూ ఆలోచించాల్సిన విషయం. ఢిల్లీలో ఇప్పటి పరిస్థితుల నేపథ్యంలో, అది ఏ పార్టీ అయినా సరే.. వచ్చే ఎన్నికల్లోనైనా స్పష్టమైన, పూర్తిస్థాయి మెజార్టీతో విజయం సాధిస్తుందని..ప్రజలకు సుపరిపాలన అందుతుందని ఆశిద్దాం!

# భారతదేశపు ఉక్కు మహిళ ఇందిర



స్వర్గీయ ప్రధానమంత్రి ఇందిరాగాంధీకి నివాళ్ళు అర్పిస్తున్న వై.ఎస్.సి.పి. నాయకులు అంజూరు శ్రీనివాసులు తదితరులు

ఆంధ్రరాష్ట్రం సమైక్యంగా ఉండాలని తెలుగు ప్రజలందరూ ఒకే రాష్ట్రంలో ఉండాలని స్వర్గీయ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ తుది శ్వాస వరకు పోరాడారు. ఆమె పార్లమెంటులో 1972వ సంవత్సరంలో వాదించిన మహనీయురాలు ఇందిరాగాంధీ అని వై.ఎస్.ఆర్.సి.పి. నాయకులు అంజూరు శ్రీనివాసులు అన్నారు. ఇటీవల శ్రీకాళహస్తిలో పలుచోట్ల ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రాన్ని విడదీయకుండా దళితులకు, మైనారిటీలకు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచి దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి కేంద్రంలో ఇందిరమ్మ రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డి వారి జీవితాలను పేద ప్రజలకే అంకితమిచ్చారన్నారు. వారు భౌతికంగా దూరం కావడమే ఈ రాష్ట్ర ప్రజల దౌర్భాగమన్నారు. ఇందిరమ్మ వర్ధంతి వేడుకలను పార్టీలకు అతీతంగా జరుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పేదల గుండెల్లో కొలువైన నాయకురాలు ఇందిరమ్మని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వై.ఎస్.ఆర్.సి.పి. నాయకులు గిరిప్రసాద్‌గౌడ్, రాజముదిరాజ్, మురళీయాదవ్, రవి, అంజూరు మురారి శివ, కన్నలి శేఖర్, మైనారిటీ నాయకులు షేక్. సిరాజ్‌బాషా, అమాన్, గోరా, తదితరులు పాల్గొన్నారు.

# ముసవ్వీర్ మరో అద్భుతం



నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు షేక్ ముసవ్వీర్ మరో అద్భుతాన్ని ప్రదర్శించాడు. గతంలో స్వర్ణంతో, వెండితో ఎన్నో సూక్ష్మ కళారూపాలను తయారుచేసి సింహపురీయుల ప్రశంసలు అందుకొని వున్నాడు. రొట్టెలపండుగ సందర్భంగా ముసవ్వీర్ నెల్లూరు చెరువులో రొట్టెలు వదులుతున్న మహిళలను, బారాషాహిద్ దర్గా నమూనాలను 6గ్రాముల వెండితో సూక్ష్మంగా తయారు చేసి కులమతాలకు అతీతంగా సమతాభావానికి ప్రతీకగా తయారుచేసి అందరి మన్ననలను అందుకున్నాడు. వీటిని తయారు చేయడానికి రెండురోజులు పట్టిందని ముసవ్వీర్ పేర్కొన్నారు.





## 'ఆకర్ష్' పథకాలు

వాజ్‌పేయి, అద్వానీ, రాజనారాయణ్, రాంమనోహర్ లోహియా వంటి నాయకులు ప్రతిపక్షంలో ఏళ్లతరబడి ఉన్నారు. నేటి నాయకులు పట్టుమని ఆరునెలలు కూడా ప్రతిపక్షంలో ఉండలేకపోతున్నారు. దొంగమాటలు చెప్పే కన్నా లక్ష్మీనారాయణ లాంటివారు బీజేపీలో చేరారు. వైకాపా ఆత్మగా భావించే కొణతాల రామకృష్ణ బీజేపీ జెండా ఎత్తబోతున్నాడు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నయానో, భయానో అక్కడ తెలుగుదేశం, వైకాపాలను ఖాళీచేయించే పనిలో ఉన్నాడు. అందరూ ఓటర్లను అవమానపరుస్తున్నారు. దేశమంతా అల్లుకోవడానికి బీజేపీ వాళ్లు నేరచరిత్రులను దగ్గర చేసుకోవడం మంచిది కాదు. **– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## ఇది హద్దు మీరడమే!

భారతదేశంలో మతస్వేచ్ఛ దుర్వినియోగమవుతుంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో అన్యమత ప్రచారానికి పాల్పడ్డవారిని కఠినంగా శిక్షించాలి. తిరుమలలో మత ప్రచారానికి పాల్పడిన వాళ్లు ఇదే ధైర్యంతో మక్కా మదీనా వంటి ప్రాంతాల్లో చేయగలరా? చేసి ఆ దేశాల నుండి వెనక్కి రాగలరా? మితిమీరిన మత స్వేచ్ఛ వల్లే హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఇలాంటివి జరుగుతున్నాయి. కేంద్రప్రభుత్వం దేశంలో మత ప్రచారాలపై పూర్తిగా నిషేధం విధించాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**

## కాంగ్రెస్‌కు పాతర

కాంగ్రెస్‌పార్టీ దేశాన్ని నాశనం చేసిపెట్టింది. తలాతోక లేకుండా ఆంధ్రప్రదేశ్‌ను విభజించి ఇప్పుడు రెండురాష్ట్రాలు నష్టపోయేలా చేసింది. ప్రజలు తన్నుకునేలా చేసింది. అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ పోతేనే దేశం బాగుపడుతుంది.

**అవిటి మనోహర్, జలదంకి.**

## మానిన గాయాలను రేపొద్దు

సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఏకతా యాత్రలో ప్రధాని నరేంద్రమోడీ 1984 నాటి సిక్కు అల్లర్లను ప్రస్తావించడం శోచనీయం. మానుతున్న గాయాలను పదేపదే రెచ్చగొట్టడం వల్ల ఎవరికీ ఉపయోగం లేదు. 1984 అల్లర్లను మోడీ ప్రస్తావిస్తే మరి 2002 గుజరాత్ అల్లర్ల సంగతేంటి? పాత గాయాలను వదిలి రేపటి గురించి ఆలోచించండి.

**ఎస్.కె.నౌషద్, నెల్లూరు.**

## రాజధానిని మార్చండి

సారవంతమైన భూములున్న గుంటూరు, కృష్ణ జిల్లాల్లో రాజధాని పెట్టడం కరెక్ట్ కాదు. మూడుకార్లు పండుతూ, కోట్ల రూపాయల విలువ చేసే భూములను లాక్కోవాలని ప్రభుత్వం చూస్తుంది. ఈ రెండు జిల్లాలో రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కునే బదులు, కారు చౌకగా భూములు లభించే ప్రాంతాల్లో ఇప్పటికైనా రాజధాని ఏర్పాటు పరిశీలనచేస్తే మంచిది.

**జీలుమూడి సతీష్, సింగరాయకొండ.**

# నెల్లూరుజిల్లాలో ఇక 14నియోజకవర్గాలు



## రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ

నియోజకవర్గాల పునర్విభజన కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లాలో వచ్చే ఎన్నికల నాటికి 13 నుంచి 14నియోజకవర్గాలుగా ఏర్పడుతున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఆదివారం తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరుజిల్లా వ్యాప్తంగా 45వేల సభ్యత్వ నమోదుకు ఒక్కొక్కరు రూ.100లు చెల్లించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రూ.100లు చెల్లిస్తే కార్య కర్తలకు ఇన్సూరెన్సు, ఫీజురీయంబర్స్‌మెంట్ సౌకర్యాలు అందేలా లోకేష్ ప్రణాళిక చేసినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు సందర్భంగా కార్యకర్తలకు చిప్‌తో కూడిన కార్డును అందజేయనున్నట్లు తెలిపారు. కార్యకర్తలను ఆదుకునేందుకు రూ.100లు సభ్యత్వ నమోదుకు పలు సౌకర్యాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ సమావేశంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీమంత్రి రమేష్‌రెడ్డి, అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, జెడ్.శివప్రసాద్, చాట్ల నరసింహారావు, అంచల వాణి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికి కోటంరెడ్డి చేయూత



పసిప్రాయంలోనే మధు మేహవ్యాధితో బాధపడు తున్న ఓ చిన్నారికి అన్నగా అండగా నిలిచి తనలోని మానవత్వాన్ని, మంచితనాన్ని చాటుకున్నాడు నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. ఈమధ్య ఆయన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనడానికి నెల్లూరు రూరల్ మండలం ములు మూడిగ్రామానికి వెళ్లారు. అక్కడ అరుంధతి అనే 7ఏళ్ల చిన్నారి మధుమేహంతో బాధపడుతున్న సంగతి తెలిసింది. ఆ పాపకు మందులకే నెలకు వెయ్యిరూపాయలు ఖర్చవుతున్న విషయం తెలిసి ఆయన మనసు కరిగిపోయింది. ఆమె కుటుంబానికి అంతటి ఆర్థికస్థోమత లేదని తెలిసి కోటంరెడ్డే ఆ పాపకు సంవత్సరానికి సరిపడా మందలకయ్యే ఖర్చు 12వేల రూపాయలను అందజేశారు. అంతేకాక మంగళవారం ఆ పాపను నెల్లూరులోని చక్కెర డాక్టర్ అనిల్‌కు చూపించి వైద్యపరీక్షలు చేయించారు. కోటంరెడ్డి రాజకీయంగా ఇనుములాంటి మనిషి. ఎక్కడా కరగడు, అరగడు. కాని రాజకీయాలలో ఎంత గట్టిగా వున్నా మానవత్వంలో తనది స్పందించే హృదయమని చాటుకున్న శ్రీధర్‌రెడ్డికి అభినందనలు.

# అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.13లక్షలు విలువైన ఆభరణాల స్వాధీనం



నెల్లూరుజిల్లాతో పాటు గుంటూరు, కర్నూలు జిల్లాల్లోని దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్న అంతర్‌రాష్ట్ర దేవాలయాల దొంగల ముఠాను ఎట్టకేలకు పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరుజిల్లా ఎస్పీ యస్.సెంథిల్‌కుమార్ సోమవారం తెలిపారు. నెల్లూరుజిల్లాలోని పలు ప్రాంతాల్లో దేవాలయాల్లో జరుగుతున్న దొంగతనాలపై ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రెడ్డిగంగాధరరావు పర్యవేక్షణలో నెల్లూరురూరల్ డిఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో సిసిఎస్ సిఐలు బాజీజాన్ సైదా, ఎం.బాలసుందరరావు, కోవూరు సిఐ అశోక్‌రెడ్డి, సిసిఎస్ ఎస్సై యస్.కె.షరీఫ్, సిబ్బంది బృందంగా ఏర్పడి నిఘాపెట్టారు. దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఈ దొంగల ముఠాను అరెస్టు చేశారు. మొత్తం 61కేసుల్లో ఏసుపోగు నాగరాజు, మహ్మద్ నాసిర్, కరమాల లోకనాథం, కొట్టే శ్రీనివాసులు, షేక్ మస్తాన్‌లు నిందితులుగా ఉన్నారు. మరోముగ్గురు పరారీలో ఉన్నారు. దొంగల ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన వారికి జిల్లా ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

# ఎర్రచందనం స్మగ్లర్లకు బేడీలు

వివిధ కేసులకు సంబంధించి ఆరుమంది ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. నెల్లూరుజిల్లా ఆత్మకూరు సిఐ అల్తాఫ్ హుస్సేన్ ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సంబంధించి ఓ కేసులో పామూరు రవి అలియాస్ కూరగాయల రవి, చిలకలమర్రికి చెందిన నల్లి వెంకటేశ్వర్లు, యాకసిరి తిరుపాలు అరెస్ట్ అయ్యారు. మరో కేసులో చెన్నైకి చెందిన స్మగ్లర్లతో సంబంధాలు వున్న నెల్లూరుకు చెందిన పుట్టా శివశంకర్ అలియాస్ శివారెడ్డి, సాతూరు ధనవేల్ అలియాస్ ధన, చెన్నైకి చెందిన సురేష్, రాజేంద్ర పోలీసులకు చిక్కారు.


లాయర్

ఆహ్వానము




భారతదేశ మాజీ ప్రధాని

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారి

125వ జయంతి సందర్భంగా

"బాలల దినోత్సవం"

తే.14.11.14ది, శుక్రవారం ఉదయం గం. 9.30ని.లకు

రావుబహుదూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం

(టౌన్‌హాల్) నందు తొలిసారిగా లాయర్ వారపత్రిక

ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం.

ఈ సందర్భంగా నెల్లూరు చిన్నారుల విజయగాధల వీచిక

లాయర్

'చిన్నారుల విజయదీపిక'

ప్రత్యేకసంచిక ఆవిష్కరణ మరియు

'కళాంజలి' అనంత్ పర్యవేక్షణలో చిన్నారులచే

సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించబడతాయి.

పై కార్యక్రమంలో లాయర్ ఆత్మీయులు, ఆప్తులు, పాఠకులు, ప్రకటనకర్తలు చిన్నారులు వారి తల్లిదండ్రులు, గురువులు, నెల్లూరు పురప్రజలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి.



ముఖ్యఅతిథి

సేవకు వారధి, బాలల పెన్నిధి

శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు



ఆత్మీయ అతిథులు

నెల్లూరు రూరల్ శాసనసభ్యులు

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గారు



ప్రముఖ సాహితీవేత్త, సినీ గేయరచయిత

శ్రీ వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ గారు



ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు

డాక్టర్ టి.రవికుమార్ గారు

మీ ఆగమనాభిలాషి ...

తుంగా శివప్రభాత్‌రెడ్డి, సంగ్రాహకుడు

# నెల్లూరు కబుర్లు

## అర్ధరాత్రి ఎంఇ ఇంటి తలుపుతట్టిన మంత్రి

నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద మంగళవారం రాత్రి రొట్టెల పండుగ ఏర్పాట్లు చూస్తున్న మున్సిపల్ మంత్రి పి.నారాయణ జిల్లా అధికారులకు పెద్ద షాక్ ఇచ్చారు. మంత్రి మంగళవారం అర్ధరాత్రి సమయంలో దర్గావద్ద కొచ్చి ఏర్పాట్లు చూస్తున్నారు. అంతలో అక్కడ మంచినీటి సమస్య తలెత్తింది. భక్తులు ఈ సమస్యను తన దృష్టికి తీసుకు రావడంతో మంత్రి స్పందించి మున్సిపల్ ఇంజనీర్ కోసం ఆరాతీశారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో తన సెల్ నుండే ఆయన సెల్‌కు ఫోన్‌చేశారు. ఎన్నిసార్లు చేసినా ఆయన ఎత్తలేదు. దీంతో మంత్రి నేరుగా మాగుంట లేఅవుట్‌లోని మున్సిపల్ ఇంజనీర్ శ్రీనివాసరావు ఇంటి వద్దకొచ్చి కాలింగ్‌బెల్ కొట్టారు. ఇంత అర్ధరాత్రి వేళ వచ్చిందెవరబ్బా అనుకుంటూ ఎంఇ తలుపు తీశారు. అంతే, ఎదురుగా వున్న మంత్రిని చూసి అదిరిపోయారు. ఆయన అంత అర్ధరాత్రి వేళ వచ్చాడంటే ఎంతో ఎమర్జెన్సీ పని అయ్యుంటుందని టెన్షన్ పడ్డాడు. దర్గా వద్ద సమస్య గురించి తెలుసుకుని మంత్రితో పాటు దర్గా వద్దకెళ్ళి అప్పటికప్పుడు మంచినీటి సమస్యను పరిష్కరించారు.

## నెల్లూరులో ఎటుచూసినా సందడే!

ఓ పక్క రొట్టెల పండుగ... ఇంకోపక్క కార్తీకమాస పూజలు... నెల్లూరులో ఎటు చూసినా భక్తుల సందడే! 4, 5, 6తేదీలలో బారాషహీద్ దర్గా వద్ద జరిగిన రొట్టెల పండుగకు దేశవిదేశాల నుండి లక్షల సంఖ్యలో భక్తులు వచ్చారు. వేలసంఖ్యలో ఇతర ప్రాంతాల నుండి వాహనాలు వచ్చాయి. ఇంకోపక్క 6వ తేదీ కార్తీకపౌర్ణమి కావడంతో ఏ శివాలయం వద్ద చూసినా భక్తులు బారులు తీరి కనిపించారు. మొత్తంమీద ఈ నాలుగురోజులు నెల్లూరంతా పండుగ వాతావరణమే కనిపించింది.

## గణితంలో డా॥ కిషోర్స్ రత్నం విద్యార్థుల ప్రతిభ



తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం వారు ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో సివి రామానుజం వారి ఆధ్వర్యంలో జరిగే గణిత టాలెంట్ సెర్చ్ పోటీలలో నెల్లూరు సరస్వతినగర్ రత్నంహైస్కూల్ (ఒలింపియాడ్ బ్యాచ్)కు చెందిన 8మంది విద్యార్థులు విజయం సాధించి రెండవస్థానంలో ప్రతిభా పరీక్షకు 6వ తరగతి విద్యార్థి పి.వి.ప్రణిత్‌సింగ్, 7వ తరగతి విద్యార్థి పి.వినీల, 8వ తరగతి విద్యార్థి ఐ.వి.ప్రణవ్‌రెడ్డి, 9వ తరగతి విద్యార్థులు కె.యస్.ప్రణీత, యం.వి.కిరణ్, 10వ తరగతి విద్యార్థులు కె.రూపేష్, పి.యస్.యస్.మోహిత్, యన్.నాగేంద్రసాయి ఎంపికయ్యారు. రెండవ స్థాయికి ఎంపికైన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను డైరెక్టర్స్ డా॥ కె.కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్‌లు అభినందించారు.

ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపల్ కెవిడి మనోజ్‌కుమార్, ఏఓ ప్రియాంక, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దాడులపై చర్యలు తీసుకోండి

**ఎస్పీని కోరిన ప్రసన్న**

జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసు దాడులను ఆపాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎస్పీ సెంథిల్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో డిఎస్పీలు, సిఐలు అధికారపార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ వైకాపా నాయకులను, కార్యకర్తలను వేధిస్తున్నారని, ఇటీవల నెల్లూరు నగరంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలోనూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని, రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, తమ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భద్రత కల్పించాలని ఆయన ఎస్పీని కోరారు.

## విద్యుత్ సిబ్బందికి అభినందనలు

ఉత్తరాంధ్రలో సంభవించిన హుద్‌హుద్ తుఫాన్ ధాటికి స్థంభించిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు నర్సీపట్నం, విజయనగరం, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో రేయింబవళ్లు నిరంతరాయంగా పనిచేసిన సిబ్బందికి ట్రాన్స్‌కో ఎస్ఇ నాగశయనరావు అభినందనలు తెలిపారు. 1వ తేదీ విద్యుత్‌భవన్‌లో అధికారులతో కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నెల్లూరుజిల్లా నుంచి వెయ్యి మందిని పంపించి నట్లు తెలిపారు. తుఫాన్ తాకిడికి దెబ్బతిన్న ప్రాంతాలకు జిల్లా నుంచి 30లారీల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుళ్ళు, కండక్టర్లు, ఇన్సులేటర్లు తదితర సామాగ్రిని పంపామని, వాటి విలువ సుమారు రూ.3కోట్లు ఉంటుందని, తుఫాన్ తాకిడికి 33కేవి, 11కేవి, ఎల్టీలైన్స్, ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, విశాఖ, విజయనగరం జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో డిఇ టి.వెంకటేశ్వరరావు, నగర డిఇ జగన్మోహన్‌రెడ్డి, ఏడిఇలు, ఏఇలు పాల్గొన్నారు.

# నాణ్యత లోపిస్తే ఊరుకోం!

**- ఎమ్మెల్యే అనిల్**



నిర్మాణంలో వున్న వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు శెట్టిగుంటరోడ్డు వద్ద సర్వేపల్లి కాలువపై పాత వంతెనను కూల్చి దాని స్థానంలో నిర్మిస్తున్న కొత్త వంతెన పనులను నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ సోమవారం పరిశీలించారు. గత ప్రభుత్వంలో కట్టిన వంతెనలు కొంత కాలానికే పగుళ్లిచ్చాయని, ఈ వంతెనను కూడా అదే కాంట్రాక్టర్ చేస్తున్నారని, వంతెన నిర్మాణంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజాధనంతో కట్టే ఈ వంతెనలు ప్రజలకు పదికాలాల పాటు ఉపయోగపడేలా ఉండాలేగాని కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి కాదన్నారు. నగరంలోని మురికి కాలువల్లో పూడికతీయక దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, వెంటనే అన్ని మురికికాలువల్లో సిల్టును తొలగించి దోమల బాధ నుండి విముక్తి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్, కార్పొరేటర్లు ఖలీల్, ఓజిలి రవిచంద్ర, వైకాపా నాయకులు పెళ్లూరు శ్రీనివాసులు, అల్లం నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డిఆర్ఓగా సుదర్శన్‌రెడ్డి

జిల్లా రెవెన్యూ అధికారి ఎన్‌వి నాగేశ్వరరావును బదిలీ చేశారు. ఆయనను కడప జిల్లాలో గాలేరు, నగరి ప్రాజెక్టులకు స్పెషల్ కలెక్టర్‌గా నియమించారు. కాగా ఆయన స్థానంలో సుదర్శన్‌రెడ్డిని నియమించారు. ప్రస్తుతం ఈయన అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్నారు. సుదర్శన్‌రెడ్డి 2002 నుండి 2004వరకు నెల్లూరు ఆర్డీఓగా కూడా పనిచేసివున్నారు. జిల్లావాసులకు ఆయన సుపరిచితులు. రెండు మూడురోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశముంది.

## డిటిసి బదిలీ

నెల్లూరు రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఎ.మోహన్ కాకినాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు డిటిసిగా పనిచేస్తున్న శివరాంప్రసాద్‌ను నియమించారు.

## అక్రిడేషన్ దరఖాస్తులు

2015 సంవత్సరానికి గాను అక్రిడేషన్ పొందేందుకు గుర్తింపు కలిగిన జర్నలిస్టులు దరఖాస్తులను ఈ నెల 30 లోగా తమ కార్యాలయంలో అందజేయాలని జిల్లా పౌరసంబంధ అధికారి మనోరంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2013–14 అక్రిడేషన్ జెరాక్స్, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల పేపర్ కటింగ్‌లను దరఖాస్తుకు జతచేయాలని కోరారు.

## వివేకా బియ్యం వేలం



వేలంపాట నిర్వహిస్తున్న వివేకా

తుఫాన్ బాధితుల సహాయార్థం మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి వీధివీధి తిరిగి సేకరించిన బియ్యాన్ని సోమవారం వేలం వేశారు. ఈ వేలం ద్వారా 2లక్షల 49వేల రూపాయలు వచ్చాయి. నగరంలో నెహ్రూబొమ్మ వద్ద బియ్యం వేలం పెట్టగా చాలామంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కో బస్తాను 1500 నుండి 2వేల రూపాయల వరకు పెట్టి కొనుకున్నారు. వివేకానే స్వయంగా వేలంపాట నిర్వహించారు. వచ్చిన డబ్బును తుఫాన్ బాధితులకు పంపనున్నట్లు వివేకా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిండి సురేష్, ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, అళహరి విజయ, షఫి తదితరులు పాల్గొన్నారు.

## సిఐడి ఆఫీసులో డిఐజి

రాయలసీమ డిఐజి బి.వి.రమణకుమార్ సోమవారం నెల్లూరులోని సిఐడి కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయం రికార్డులను పరిశీలించి కేసుల పురోగతి గురించి తెలుసుకున్నారు. కేసులను త్వరగా తేల్చిన అధికారులను అభినందిస్తూ, పెండింగ్ కేసులను కూడా త్వరగా ఒక కొలిక్కి తేవాలని సూచించారు. ఆయన వెంట సిఐడి డిఎస్పీలు వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రావు, సిఐలు వెంకటకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డిలు ఉన్నారు.

## వైయస్సార్సీపీ మహిళ, ఎస్సీ అధ్యక్షుల నియామకం

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు నగర మహిళా విభాగం అధ్యక్షురాలిగా మొయిళ్ల గౌరిని, పార్టీ ఎస్సీ విభాగం నెల్లూరు నగర అధ్యక్షుడిగా తాళ్లూరు సురేష్‌ను నియమించినట్లు వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆమోదంతో వీరిని నియమించినట్లు తెలిపారు.

# న్యాయవాదులు సమాజాభివృద్ధికి పాటుపడాలి

**- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్**



కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జస్టిస్ ప్రవీణ్‌కుమార్

న్యాయవాదులు ధనాపేక్ష లేకుండా సమాజాభివృద్ధికి పాటుపడాలని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి నెల్లూరుజిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ నెల 1వ తేదీన నెల్లూరు బార్ అసోసియేషన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులు తమ సీనియర్లను గౌరవించడం వృత్తిలో ప్రధాన అంశంగా గుర్తించుకోవాలన్నారు. నెల్లూరుజిల్లా చారిత్రాత్మకంగాను, రాజకీయంగాను ఎంతో పేరుప్రఖ్యాతులు కలిగి వున్నదన్నారు. పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ కనకదుర్గా రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముసునూరు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, అదనపు జిల్లా జడ్జీలు జగదీష్‌చంద్రరావు, నరశింహరాజు, ఆనంద్, గుర్రప్ప, జిల్లా ఫోరం ఛైర్మెన్ పివి కృష్ణమూర్తి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.రజని, భూపాల్ రెడ్డి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుబ్బలక్ష్మి, అయ్యప్పరెడ్డి, రంగారావు, జిల్లాలోని పలు కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అదేరోజు ప్రవీణ్‌కుమార్ నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారిని దర్శించుకుని విశేషపూజలు నిర్వహించారు.



మెకనైజ్డ్ యాండ్లింగ్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

## బొగ్గు రవాణాలో
# కృష్ణపట్నం పోర్టు ముందడుగు

### మెకనైజ్డ్‌కోల్ హేండ్లింగ్ ప్లాంటును ప్రారంభించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

నెల్లూరుజిల్లాలో పారిశ్రామిక ప్రగతిని ఉరకలెత్తించిన కృష్ణపట్నం పోర్టు మరో ముందడుగు వేసింది. ఈ పోర్టులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన యాంత్రిక బొగ్గురవాణా వ్యవస్థ (మెకనైజ్డ్ కోల్ యాండ్లింగ్ ఫ్లాంటు)ను సోమవారం కేంద్ర ఉపరితల రవాణా, పోర్టులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి పొన్‌రాధాకృష్ణన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రులిద్దరు కూడా పోర్టును పరిశీలించి శరవేగంగా అభివృద్ధి చేస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. కృష్ణపట్నం పోర్టుకు విదేశాల నుండి భారీఎత్తున బొగ్గు దిగుమతి అవుతుంది. కృష్ణపట్నం సెజ్‌లో దాదాపు 25వేల మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు వెలుస్తున్నాయి. వీటన్నింటికి బొగ్గు విదేశాల నుండి రావాల్సిందే! కృష్ణపట్నం పోర్టు వద్ద బొగ్గు దిగుమతి చేసుకోవాలి. ఓడల నుండి బొగ్గును అత్యంత వేగంగా, సులభంగా అన్‌లోడింగ్ చేసేందుకు పోర్టు యాజమాన్యం యాండ్లింగ్ ప్లాంటును ఏర్పాటు చేసింది. దీనిద్వారా గంటకు 3వేల టన్నుల బొగ్గు లేదా ఇతర సరుకులను దించవచ్చు. ఇక్కడ దించిన బొగ్గును కన్వేయర్ బెల్టు ద్వారా సమీపంలో వున్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు చేరవేస్తారు. పోర్టు సెజ్‌లో థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఇంకా ఎక్కువగా వచ్చే అవకాశముంది. 2018 నాటికి 100మిలియన్ టన్నుల వార్షిక దిగుమతులు తమ పోర్టు లక్ష్యమని, అందుకు అనువైన వసతులన్నీ ఏర్పాటు చేస్తున్నామని పోర్టు సిఇఓ ఎండ్లూరి అనిల్‌కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నవయుగ యం.డి. చింతా శశిధర్, సిఓఓ ఎస్.సుబ్బారావు, పిఆర్ఓ వేణుగోపాల్‌లు పాల్గొన్నారు.

**సవరణ:** గత వారం తేది.31.10.2014 సంచికలో కాలధర్మం వార్తలో శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ గారికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తెగా పొరపాటున ప్రచురించబడినది. ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలుగా సవరించుకోగలరని పాఠకులకు మనవి. పొరపాటుకు క్షంతవ్యులం. - సం/-

# అమ్మ గుర్తుగా అన్నదానం

- 2వేల మంది పేదలకి భోజనం పెట్టిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి




సృష్టిలోనే అన్నింటికంటే తియ్యనైన పదం అమ్మ. కమ్మనైనది అమ్మ ప్రేమ. వెలకట్టలేని అమ్మ అనురాగం, అపురూపమైనది అమ్మ ఆప్యాయత. అలాంటి అమ్మని స్మరించుకుంటూ రెండువేల మంది పేదవారికి ఓ పూట కడుపునిండా అన్నం పెట్టాడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఆయన తల్లి వేమిరెడ్డి శ్యామలమ్మ మొదటి వర్ధంతిని పురస్కరించుకుని నవంబర్ 1వ తేదీన కొన్ని సేవాసంస్థలను ఆలయ ప్రాంగణాలను ఎంపిక చేసుకుని సుమారు 2వేల మందికి పైగా అన్నవితరణ చేశాడు ప్రభాకర్‌రెడ్డి. సందర్భంతో సంబంధం లేకుండా ఎక్కడ ఏ అవసరమున్నా తాను న్నానంటూ స్పందించే సేవాభిలాషి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. సేవ ఆయనకి వ్యసనం అని పలు సందర్భాల్లో 'లాయర్' ఆయనని ప్రస్తుతించింది. తాను ప్రాణంకన్నా ఎక్కువగా భావించే తన కన్నతల్లి గుర్తుగా ఆయన నవంబర్1న ఈ కార్యక్రమాలను చేపట్టాడు. వాత్సల్యలో 450మందికి, చిల్డ్రన్స్‌పార్క్ సాయిబాబా మందిరం వద్ద 750 మందికి, ప్రగతి ఛారిటీస్‌లో 250 మందికి, మదర్‌థెరిస్సా హోమ్‌లో 150 మందికి భోజన సదుపాయాలను ఏర్పాటు చేయడమేకాకుండా 'నేస్తం' ఫౌండేషన్ ఆధ్వర్యంలో గీతామయి వృద్ధాశ్రమం, ఎల్‌విడి హోమ్, వియన్నాహోమ్, భెతల్ వేళాంగిణి మాత స్కూళ్లల్లో దాదాపు 750 మందికి అన్నం పెట్టారు. తన తల్లి శ్యామలమ్మకు ఇంటికి వచ్చిన వారెవరికైనా అన్నం పెట్టడమంటే ఇష్టం. పదిమంది కడుపునింపితే వారి దీవెనలు మనల్ని కాపాడుతాయన్నది ఆమె నమ్మకం. తల్లి ఆశయాలబాటలో తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాడు ప్రభాకర్‌రెడ్డి.




## శివాలయంలో అయ్యప్పస్వాముల కోసం
## లక్షా యాభైవేలు విరాళం

నెల్లూరు మూలాపేటలోని శివాలయంలో కార్తీకమాసం మొత్తం వచ్చే అయ్యప్ప భక్తుల "భిక్ష"(భోజనం) కోసం లక్షాయాభైవేల రూపాయల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందించారు. ఈ నెలరోజులూ శివాలయంలో భోంచేసే అయ్యప్ప భక్తులకోసం ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





ర్యాలీలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, క్లబ్ ప్రతినిధులు

# ప్రతి ఒక్కరూ శాంతితో మెలగాలి

ప్రపంచంలో ప్రతి ఒక్కరూ శాంతితో మెలగాలని పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన అన్నారు. పట్టణంలోని వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచాన్ని శాంతిబాటలో నడిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మంజూలాదేవి, మురళీనాయుడు, గురునాథం, కౌన్సిలర్ రమేష్, వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ కె.చంద్రమోహన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# పిఆర్ క్లబ్ చేయూత



ఆర్డీవో కె.శ్రీనివాసరావుకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న పిఆర్ క్లబ్ సభ్యులు

హుద్‌హుద్ తుఫాను బాధితులకు తమవంతు చేయూతనందించేందుకు పిఆర్ క్లబ్ ప్రతినిధులు ముందుకొచ్చారు. ఈ క్రమంలో సోమవారం రూ.లక్ష చెక్కును ఆర్డీవో కె.శ్రీనివాసరావును గూడూరు సబ్‌కలెక్టర్ బంగళాలో కలిసి అందజేశారు. తుఫాను తాకిడితో తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకొనేందుకు అందరూ సాయం అందించాలని వారు పిలుపునిచ్చారు. పిఆర్ క్లబ్ అధ్యక్షులు జి.శశిధర్‌రెడ్డి, మాజీఅధ్యక్షులు జనరల్ సెక్రటరీ యల్లసిరి శ్రీనివాసులురెడ్డి, మాజీఅధ్యక్షులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ఎస్.రామ్మోహనరావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మెన్ పర్రి జనార్ధన్, సీనియర్ సభ్యులు డి.దశరథరామిరెడ్డి, పి.లక్ష్మీనారాయణ, వై.సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను బాధితులకు రూ.4లక్షలు



జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డికి చెక్కను అందజేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు

హుద్‌హుద్ తుఫాను బాధితులకు అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ స్పందించాలని ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రమోహన్ తెలిపారు. గూడూరు పట్టణంలోని రోటరీభవనంలో మంగళవారం పట్టణ, నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల యాజమాన్యం ప్రతినిధులు రూ.4లక్షల విరాళాలు సేకరించి అందజేసినట్లు చెప్పారు. ప్రైవేటు పాఠశాలల జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలలు సంయుక్తంగా విరాళాలు సేకరించి అందజేయడాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బి.దశరథరామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంజీవరాజు, జి.వి.పవన్‌కుమార్, ఐ.కమలాకర్, రాఘవరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోక్షధామాన్ని
# సద్వినియోగం చేసుకోండి

గూడూరు రెండోపట్టణ పరిధిలోని అడవయ్యకాలనీ వద్ద ఏర్పాటు చేసిన మోక్షధామాన్ని ఉచితంగా సద్వినియోగం చేసుకోవాలని వైజేపీ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు మంజులాదేవి తెలిపారు. పట్టణంలోని ఆసుపత్రిరోడ్డులో ఉన్న డాక్టర్ సిఆర్‌రెడ్డి వైద్యశాలలో ఇటీవల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాససముదాయాలు, అద్దె ఇళ్లు, ఇరుకు ఇళ్లల్లో నివాసం ఉంటున్న కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే వారి మృతదేహాలను బంధువులు వచ్చేంతవరకు ఉంచడం, కర్మక్రతులు నిర్వహించేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి వారికి డాక్టర్ జనార్ధన్‌రెడ్డి తన తండ్రి వెంకురెడ్డి జ్ఞాపకార్థం మోక్షధామాన్ని నిర్మించారన్నారు. అవసరమైన సమయంలో దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, డాక్టర్లు సిఆర్‌రెడ్డి, సి.జనార్ధన్‌రెడ్డి, సి.రోహిణి, క్లబ్ ప్రతినిధులు అశోక్‌కుమార్, ఎస్‌ఎల్‌ఎన్ స్వామి, మురళీనాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలు ఎన్ని వచ్చినా
# మహిళలకు భద్రత కరవు



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలకు నిర్ధిష్టమైన భద్రత లేకుండా ఉందని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ అన్నారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 14న జరిగే బాలల దినోత్సవం అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించాలని, డ్వాక్రా మహిళలతో కలిసి మండల కేంద్రాలలో ధర్నా నిర్వహించాలని సభ్యులకు సూచించారు. ఇదే నెల 21, 22తేదీలలో డివిజన్‌లోని మండలాలలో జీపు యాత్ర నిర్వహించి 24వ తేదీ గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సమస్యల పరిష్కారానికి ధర్నా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, కృష్ణవేణి, యాదగిరి, కేశవులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




ఇటీవల గూడూరు ఎల్ఐసి కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో నెల్లూరు ఎల్ఐసి ఎస్‌డిఎం పి.రమేష్‌బాబు నుండి బెస్ట్‌పెర్ఫార్మెన్స్ అవార్డును అందుకుంటున్న గూడూరు ఎల్ఐసి ఏజెంట్ అనిమెళ్ళ రాజేశ్వరిదేవి, పక్కన ఎల్ఐసి ఎంఎం బాలయ్య చౌదరి, గూడూరు బ్రాంచ్‌మేనేజర్ రాముచౌహాన్, ఏబిఎం ఆంజనేయులు, సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఏ.శివసుబ్రహ్మణ్యం.

# ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

## రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ



తెలుగుదేశంపార్టీ సభ్యత్వం తీసుకునే ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశంపార్టీ పనిచేస్తోందని రాష్ట్ర మునిసిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు 7వ డివిజన్‌లో నగర కన్వీనర్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నగర ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. మొదటి సభ్యత్వాన్ని రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్ళపాక అనురాధకు ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమెరికాలో 32లక్షల మందితో ఆర్మీ ఉందన్నారు. మన రాష్ట్రంలో 30నుంచి 50లక్షల మంది కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ ఆర్మీలో చేరడమే లక్ష్యంగా చంద్రబాబునాయుడు సభ్యత్వనమోదుకు శ్రీకారం చుట్టారన్నారు. సభ్యత్వం తీసుకునే ప్రతి కార్యకర్తను అన్ని విధాలుగా ఆదుకునేందుకు పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జడ్.శివప్రసాద్, మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, తెలుగుమహిళా అధ్యక్షురాలు అంచల వాణి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మున్వర్‌బాషా, కార్పొరేటర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమార్కులపై కమిషనర్ కొరడా!

నెల్లూరు నగరపాలక సంస్థలో క్రిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదని నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ కెవిఎన్ చక్రధర్‌బాబు హెచ్చరించారు. అవినీతిని కూకటివేళ్ళతో సహా తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ అవినీతి ఏ స్థాయిలో జరిగినా ఊరుకునేది లేదని, అక్రమార్కులను ఉపేక్షించేది లేదని కమిషనర్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. ప్రజారోగ్య శాఖలో బోగస్ మరణ ధృవీకరణ పత్రం జారీపై ఎంహెచ్‌ఓను సస్పెండ్ చేశారు. అవినీతిని నిర్మూలించితే నగరాభివృద్ధి సాధ్యమేనన్నారు. విడతల వారీగా నగరాభివృద్ధి చేస్తామన్నారు. జిఐఎస్(జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) అనే శాటిలైట్ విధానం ద్వారా నగరాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ విధానం వల్ల ప్రతి ఇంటి పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. దీంతో నగరపాలక సంస్థకు ఆదాయం వస్తుందన్నారు. పూర్తిగా సాంకేతిక సహాయంతో నగరాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. నగరం విస్తీర్ణంలో భాగంగా మాస్టర్‌ప్లాన్‌ని అనుసరించి త్వరలో ఆక్రమణల తొలగింపు చేపడుతున్నట్లు తెలిపారు. ఏళ్ళతరబడి ఇక్కడే తిష్టవేసిన వారికి తప్పకుండా మార్పులు చేర్పులు ఉంటాయన్నారు. ముందుగా శానిటేషన్ సిబ్బంది లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందన్నారు. నెల్లూరు నగరంలో ట్రాఫిక్‌కు కారణమైన తోపుడుబండ్లు, రోడ్లు ప్రక్కనే వ్యాపారం చేసుకునే వారికి నగరపాలక సంస్థ, మెప్మా తరపున కొత్త పథకం అందుబాటులోకి తెచ్చామన్నారు. "అర్బన్ పావర్టీలోన్" కింద వీరికి రుణాలు ఇస్తామన్నారు. 12వేల మందిని గుర్తించాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటికి 1700మందిని గుర్తించినట్లు తెలిపారు.

# ప్రసన్నకు షుగర్ ఫ్యాక్టరీ అవినీతిలో వాటా!

## కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి

నెల్లూరుజిల్లా కోవూరు షుగర్‌ఫ్యాక్టరీలో జరిగిన రూ.23కోట్ల అవినీతిలో వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి వాటా ఉందని, ఈ అవినీతి, అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటి వేసి తిన్న షుగరంతా కక్కిస్తానని కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఘాటుగా విమర్శించారు. సోమవారం నెల్లూరు టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ 2010నుంచి 2013 వరకు కోవూరు ఎమ్మెల్యేగా వ్యవహరించిన సమయంలో షుగర్ ఫ్యాక్టరీ ఎండి సుధాకర్‌రెడ్డితో కలసి అవినీతికి పాల్పడి చెరుకురైతును నిలువునా దగాచేశారని, నాసిరకమైన యంత్రాల కొనుగోలు చేసి కమీషన్లకు కక్కుర్తిపడ్డాడని, ఈ విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. నవ్యాంధ్ర నిర్మాణం కొరకు అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై గ్లోబల్ ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

# జిఎస్ఎల్‌వి-మార్క్3 రెడీ

సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి డిసెంబర్ 12 నుంచి 20తేదీల మధ్యలో జిఎస్ఎల్‌వి-మార్క్3 వాహకనౌకను ప్రయోగాత్మకంగా నింగిలోకి పంపాలని ఇస్రో శాస్త్రవేత్తలు నిర్ణయించారు. షార్‌లోని బ్రహ్మ ప్రకాష్ హాలులో సోమవారం రాత్రి ఎంఆర్‌ఆర్ ఛైర్మెన్ బిఎన్ సురేష్ ఆధ్వర్యాన రాకెట్ సన్నద్ధత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిఎస్ఎల్‌వి-మార్క్3కి సంబంధించిన అన్ని సాంకేతిక విషయాలపై చర్చించారు. వ్యాబ్‌లో ఇప్పటికే వాహకనౌకకు సంబంధించిన మొదటిదశలో ఎస్200, రెండో దశలో ఎల్110 పనులు పూర్తయ్యాయి. ఇక మూడవ దశలో సి25కు బదులు క్రూమాడ్యూల్‌ను మాత్రమే ఏర్పాటు చేయాల్సి వుంది. ఈ సమావేశంలో షార్ డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్, జిఎస్ఎల్‌వి-మార్క్3 ప్రాజెక్ట్ డైరెక్టర్ సోమనాథ్, సీనియర్ శాస్త్రవేత్తలు నారాయణ అలెక్స్, దత్తన్ తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆదాయం కంటే ఖర్చులే అధికంగా ఉంటాయి. వృత్తివ్యాపారాలు ప్రోత్సాహకరంగానే ఉంటాయి. ముఖ్య శుభవార్త వింటారు. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. ఉద్యోగ నిర్వహణలో జాగ్రత్త వహించండి. షేర్లు, పెట్టుబడులు నిరుత్సాహం కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ పెట్టండి. విద్యా ప్రగతి బాగుంటుంది. డబ్బు జాగ్రత్తగా పెట్టుకొనండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉంటుంది. కాని మనస్సుకు కొరతగా అనిపిస్తుంది. కొత్త పెట్టుబడులకు, భాగస్వామ్య పెట్టుబడులకు అవకాశాలుంటాయి. పనుల విషయంలో టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగులకు అదనపు పనిభారం, అధికారుల సహకారం బాగుంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కొన్ని ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలలోగాని, కుటుంబ నిర్ణయాలలో గాని పొరపాట్లు రాకుండా జాగ్రత్తపడండి. వృత్తి జీవనంకలవారికి కొంత ఆదాయముంటుంది. పెద్ద పెట్టుబడులు పెట్టడం, హామీలివ్వడం చేయవద్దు. కోర్టు కేసులు చికాకు కలిగించగలవు. బంధుముఖ్యులతో మాట పట్టింపు, విరోధాలుంటాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

చేసే కృషికి తగ్గట్లుగా ఆర్థికస్థితి ఉండదు. ఖర్చులు బాగా పెరిగిపోతాయి. పనులమీద శ్రద్ధ తగ్గి శారీరకంగా మానసికంగా ఇబ్బందిపడతారు. వాహనాలు నడిపేవారు, యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్త పడాలి. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి కాబట్టి అధికారులను గమనించుకొనండి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించండి.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 07.11.2014 నుండి**
**తేది. 13.11.2014 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, మేష వృషభ మిధున కర్కాటక రాశులలో చంద్రుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, తులలో రవి బుధ శుక్రులు, 12తేది నుండి వృశ్చికంలో శుక్రుడు, వృశ్చికంలో శని, ధనుస్సులో కుజుడు సంచరిస్తారు.

### పంచాంగము:

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.
ముహూర్తములు లేవు.

### కార్తీక మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 07 | శుక్ర | పాడ్యమి | రాగం.2.27వ |
| తేది. 08 | శని | విదియ | రాగం.1.59వ |
| తేది. 09 | ఆది | తదియ | రాగం.2.03వ |
| తేది. 10 | సోమ | చతుర్థి | రాగం.2.29వ |
| తేది. 11 | మంగళ | పంచమి | రాగం.3.28వ |
| తేది. 12 | బుధ | షష్ఠి | రాగం.4.54వ |
| తేది. 13 | గురు | సప్తమి | పూర్తిగ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబ సమస్యలను రాజీమార్గంలో సర్దుబాటు చేసుకొనగలరు. వాణిజ్యవృద్ధికి మంచి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం బాగుంటుంది. అనుకున్న పనులు నెరవేర్చుకొంటారు. ఉద్యోగులకు పనిబాధ్యతలపై శ్రద్ధ ఉండటం, రావలసిన బాకీలు కొంత చేతికందడం, స్థిరాస్తుల క్రయవిక్రయాలుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కావచ్చును.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యవహారాలలో నిర్ణయాలను, ఆర్థికవ్యవహారాలను సమర్థవంతంగా జరుపుతారు. మాట, ప్రవర్తనలో తొందరపాటు లేకుండా చూచుకొనండి. వృత్తివ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం బాగుంటుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలు కొంత వరకు లభించడం జరుగుతుంది. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఆర్థికంగా కొద్దిపాటి చిక్కులున్నా సమర్థించుకొని పోగలరు. భూములు, ఆస్తులు, ఇండ్ల లావాదేవీలు వాయిదా వేయండి. పనులు సమర్థతతో అనుకున్న రీతిలో పూర్తిచేస్తారు. మిమ్మల్ని విమర్శించే వారు కూడా మీకు చేరువకాగలరు. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. శుభవార్తలు వింటారు.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో రాబడి కొద్దిగా పెరుగుతుంది. ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకుంటారు. కళా క్రీడా శాస్త్ర వైద్య రంగాలవారికి పరిస్థితులు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అనుకున్న పనులు ఆలస్యంగా జరుగుతుండి మిత్రుల సహకారంతో కొనసాగిస్తారు. అవసరాలకు ఋణం చేయడం, ఇతరులు, బంధువులతో సత్సంబంధాలు గట్టి పరచుకొనడం ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబంలో స్వల్పంగా అపార్థాలు వల్ల సమస్యలుండి సర్దుకొంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. అయినా కుటుంబఖర్చులు పెరుగుతాయి. అనుకున్న పనులకు ఆటంకాల వల్ల టెన్షన్‌గా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలను సొంతంగా అజమాయిషి చేస్తారు. పెట్టుబడులకు అవకాశాలు, షేర్ల మీద లాభాలుంటాయి. కొత్తవారితో పరిచయాలుంటాయి. విద్యాప్రగతి బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కుటుంబంలో చిన్నచిన్న విషయాలవల్ల అభిప్రాయ భేదాలుంటాయి కాబట్టి సర్దుకొనిపోవాలి. బిడ్డలవల్ల ఖర్చులు, కుటుంబఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన పెరుగుదల ఉండి, ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. దైవకార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు ప్రయోజనం కలిగే పరిచయాలుంటాయి. కొత్త వస్తువులు సమకూరుతాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థికంగా పెరుగుదలకు చేసే పనులన్నీ కలిసివస్తాయి. ఆదాయము పెరుగుతుంది. సోదరవర్గానికి అభివృద్ధి ఉంటుంది. పన్నులు, బాకీలు చెల్లిస్తారు. షేర్లు, పెట్టుబడుల మీద లాభాలుంటాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు, ప్రభుత్వ సహకారం ఉంటుంది. కొత్త పథకాలు ప్రణాళికలు అమలు చేస్తారు. ఆకర్షణలకు, వత్తిడులకు లొంగవద్దు. ఆరోగ్యం కాపాడుకొనండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తివ్యాపారాలు సామాన్యంగా సాగిపోతాయి. క్రొత్త వ్యాపార అవకాశాలు, పెట్టుబడి అవకాశాలు వాయిదా పడగలవు. బంధువర్గసభ్యుల అనారోగ్య వార్తలు అందగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, కుటుంబ ఖర్చులు, కొన్ని అదనపు ఖర్చుల నుండి తప్పించుకొనలేరు. పనులు చేపట్టినవి నిదానంగా జరుగుతాయి. ఉద్యోగులకు బాధ్యతల పనిభారం పెరుగుతుంది.

# అనాథ పిల్లల ఆదరణతోనే నూతన సమాజం




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బి.వి.రమణకుమార్

అనాథపిల్లలను చేరదీసి వారి జీవితాలను తీర్చిదిద్దడం ద్వారా నూతన సమాజం ఆవిష్కరించవచ్చని సిఐడి డిఐజి బి.వి.రమణకుమార్ పేర్కొన్నారు. నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం సెమినార్ హాల్లో జరిగిన యునిసెఫ్ ట్రైనింగ్ సెమినార్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రమణకుమార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆలోచనా పరమావధి సమాజశ్రేయస్సు కావాలన్నారు. తాను ఎస్పీగా నెల్లూరులో పనిచేసినప్పుడు నెల్లూరు బోడిగాడితోట పిల్లలను చేరదీసి "క్యాప్" పేరుతో వారి అవసరాలను తీర్చిదిద్దేందుకు కృషి చేశామన్నారు. హిజ్రాలపై ఉన్న అపోహలు, వివక్షతను విడనాడాలన్నారు. నేర రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి పౌరుడూ బాధ్యత వహించాలన్నారు. అనంతరం రమణకుమార్‌ను నిర్వాహకులు సన్మానించారు. కన్వీనర్ విద్వాన్ కిరణశ్రీ, కో-కన్వీనర్లు ఎ.జయప్రకాష్, డాక్టర్ సుజ.ఎస్.నాయర్ పాల్గొన్నారు.

# మూడుసార్లు కేసులు నమోదైతే రౌడీషీట్లే

మూడుసార్లు కేసులు మోదైన వ్యక్తులపై రౌడీషీట్లు తెరుస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరుజిల్లాలో ఇటీవల వరుస హత్యలు, దోపిడీలు, దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్నవారి జాబితాను నెల్లూరు జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ ఆదేశాలమేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు తయారు చేస్తున్నారు. ఏపిపిఎం సెక్షన్ 601కి లోబడి మూడుసార్లు కేసులు నమోదైన వ్యక్తులపై రౌడీషీట్లు తెరుస్తారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 450మంది రౌడీషీటర్లు ఉన్నట్లు సమాచారం. కిరాయి హత్యలు చేయడం, దొమ్మీలు, దోపిడీలు, తరచూ అల్లర్లు సృష్టించడం, బ్యాలెట్ పేపర్లు అపహరించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం తదితర సందర్భాల్లో రౌడీషీట్లు తెరుస్తారు. ఒకసారి రౌడీషీటు తెరిస్తే ఆ వ్యక్తి ప్రతి కదలికపై పూర్తిస్థాయిలో గమనిస్తారు. ఏడాదికోసారి డిఎస్పీ రౌడీషీట్లపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తారు. నేర ప్రవృత్తికి దూరంగా వుంటూ జీవనం సాగించే వారిపై రౌడీషీట్లు తొలగిస్తారు.

# నవంబర్ 1నే రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించాలి

## నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1వ తేదీన నిర్వహించాలని నెల్లూరు పార్లమెంటుసభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నవంబర్ ఒకటిన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి మేకపాటి, నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలు కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయిందే తప్ప మనం విడిపోలేదన్నారు. రాష్ట్రావతరణ దినోత్సవం గతంలోలాగా జరుపుకుంటేనే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైయస్సార్‌సిపి కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇది అవినీతి పారుదలశాఖ

డెల్టా ఆధునీకరణ పనుల్లో నాణ్యత లేదని, నీటి పారుదలశాఖలో జరిగిన కుంభకోణాలను వెలుగులోకి తెస్తామని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో నెల్లూరుజిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షాసమావేశంలో సురేష్‌రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదలశాఖలో అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు అవినీతిలో కూరుకుపోయారని విమర్శించారు. ఈ శాఖలో జరిగే అవినీతిని అంతమొందించే వరకు పోరాటాలు చేస్తామన్నారు.

# ఉపాధి కూలి పెరిగింది

కేంద్రప్రభుత్వం పెంచిన కూలి అమలుకు సంబంధించిన సర్క్యులర్ విడుదలైంది. ఉపాధి కూలీల వేతనాన్ని రూ.149 నుంచి రూ.169కి పెంచుతూ గతంలోనే ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఏప్రిల్ ఒకటి నుంచి పెరిగిన కూలి వర్తింపజేయాలంటూ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సర్క్యులర్ జారీ చేశారు. కూలీ పెరిగినప్పటికి ప్రభుత్వం రూ.149 వంతున కూలీలకు చెల్లించినందున రూ.20లు అదనపు కూలీని అలవెన్స్‌గా ఇవ్వాలని సర్క్యులర్‌లో సూచించారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు ఉపాధిహామీ పథకంలో పనిచేసిన కూలీలందరికి ఈ అదనపు కూలీ మొత్తం విడుదలైంది. నెల్లూరు జిల్లాలో ఐదులక్షల నలభైవేల మంది కూలీలకు జాబ్‌కార్డులుండగా వీరిలో రెండు లక్షలకు పైగా పనులు చేస్తున్నారు.

## ఆత్మకూరు బ్యాంకుల్లో

# బాంబు బూచి

నెల్లూరుజిల్లా ఆత్మకూరు బ్యాంకుల్లో బాంబులు ఉన్నాయంటూ వచ్చిన ఫోన్ కాల్‌తో బ్యాంకు అధికారులు, ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సోమవారం ఉదయం 10.30గంటల నుంచి 1.15గంటల వరకు తీవ్ర ఉత్కంఠకు లోనయ్యారు. ఉదయం 10.30గంటల సమయంలో 99492 41654 సెల్ నుంచి పోలీసు విభాగం రాష్ట్రస్థాయి టోల్‌ఫ్రీ నెంబరు 100కు ఆగంతకుడు ఫోన్ చేశాడు. నెల్లూరుజిల్లా ఆత్మకూరులోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రాబ్యాంక్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లలో బాంబులు ఉన్నాయనేది విషయం. హైదరాబాద్ నుంచి ఎస్పీ విభాగానికి వచ్చిన సమాచారాన్ని ఆత్మకూరుకు చేరవేశారు. దీంతో ఆత్మకూరు సిఐ, ఎస్‌ఐలు అల్లాఫ్‌హుస్సేన్, వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. బాంబు సమాచారాన్ని బ్యాంకు అధికారులకు చెప్పి అప్పటికే రద్దీగా ఉన్న ఖాతాదారుల్ని, సిబ్బందిని బయటకు పంపేశారు. పోలీసులు అనుమానాస్పదంగా వున్న వాటినన్నింటినీ పరిశీలించారు. బాంబ్‌స్క్వాడ్‌కు సమాచారమిచ్చారు. ముందుజాగ్రత్తగా ఫైర్‌ఇంజన్‌ను బ్యాంకుల వద్దకు రప్పించారు. బాంబ్ స్క్వాడ్ బృందం మూడు బ్యాంకుల్లో అణువణువు పరిశీలించారు. పరిశీలన అనంతరం బాంబులు లేవని నిర్ధారణకు వచ్చారు. అనంతరం బ్యాంక్ సేవలు ప్రారంభమయ్యాయి. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# సుందర సింహపురికి శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

ఓట్లు, స్థానిక సంబంధాలు, పైరవీల వల్లే నెల్లూరు నగరంలో ఆక్రమణల తొలగింపు, రోడ్ల విస్తరణ వంటి కార్యక్రమాలు జరగకుండా ఆగిపోయాయి.

నెల్లూరు నగరం అంటే దేశంలోనే ఓ మంచిపేరు. కాని నగరం మాత్రం ఓ పద్ధతి పాడూ లేకుండా ఉంటుంది. నగరంలో ప్రధాన రహదారులు తక్కువ. ఒకప్పుడు అయ్యప్పగుడి నుండి బోసుబొమ్మ వరకు వున్న ట్రంక్‌రోడ్డే నగరంలో మెయిన్‌రోడ్డు. నగరంలో దాదాపు 80 శాతం ట్రాఫిక్ ఈ రోడ్డు మీదే నడుస్తుంది. తర్వాత మినీబైపాస్, ఇటీవల కాలంలో పాత పెద్దాసుపత్రి నుండి కొత్తూరు వరకు వున్న రోడ్లను కూడా అభివృద్ధి చేశారు. అయినా కూడా ట్రంకురోడ్డు మీద ట్రాఫిక్ ఏ మాత్రం తగ్గడం లేదు. నగరంలో 15 వేలకు పైగా ఆటోలు, వందకుపైగా టౌన్‌బస్సులు, వేలసంఖ్యలో కార్లు, బైక్‌లు ఇతర వాహనాలు ట్రంకురోడ్డు మీదే తిరగాలి. ప్రతిరోజూ ఎన్నోకొన్ని కొత్త వాహనాలు రోడ్డుమీదకు వస్తున్నాయి. వాహనాలు పెరిగాయని చెప్పి రోడ్లు పెరగవు కదా! అయినా మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్లను విస్తరించవచ్చు. ట్రంకురోడ్డు కిరువైపులా చాలా చోట్ల ఆక్రమణలున్నాయి. మున్సిపల్ కమిషనర్‌గా ఉమాపతి ఉన్నప్పుడు సుబేదారుపేట నుండి విఆర్‌సి సెంటర్ వరకు కొంతమేర ఆక్రమణలు తొలగించారు. అయితే ఆరోజు ఎమ్మెల్యేగా ఉన్న ఆనం వివేకానందరెడ్డి మీద వ్యాపారులు ఒత్తిళ్లు తెచ్చారు. ట్రంకురోడ్డులో వున్న అందరు వ్యాపారులతో వివేకాకు పరిచయాలుండడం, ఎన్నికలప్పుడు వారి అవసరం ఉండడంతో ఆక్రమణల తొలగింపును అర్ధాంతరంగా ఆపేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆక్రమణల తొలగింపుకు ఎవరూ పూనుకోలేదు. ట్రంకు రోడ్డులో మాత్రం రోజురోజుకీ ట్రాఫిక్ నరకంగా మారుతోంది.

**వెంకయ్య చొరవ:** నెల్లూరులో ట్రంకు రోడ్డు విస్తరణకు కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు చొరవచూపారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం ట్రంకురోడ్డును బోసుబొమ్మ నుండి శబరిక్షేత్రం వరకు వంద అడుగులు, అక్కడ నుండి అయ్యప్పగుడి వరకు 150అడుగుల వెడల్పు చేయడానికి సంకల్పించారు. నాన్‌ఐఏఎస్ కేడర్ కమిషనర్ ఉంటే గట్టిగా పనిచేయలేడని భావించిన వెంకయ్య ఐఏఎస్ అధికారిని నెల్లూరుకు కమిషనర్‌గా వేయించారు. ఆక్రమణలు తొలగించాలంటే ఆక్రమణదారుల నుండి స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిళ్లు వస్తుంటాయి. వారి నుండి కమిషనర్‌పై ఒత్తిళ్లు వస్తాయి. ఐఏఎస్ ఆఫీసర్ అయితే ఆ ఒత్తిళ్లను లెక్కచేసే పరిస్థితి ఉండదు. ఈ ముందుచూపుతోనే వెంకయ్య ఐఏఎస్ కమిషనర్‌ను వేయించారు. ఆయన ఆధ్వర్యంలోనే అయ్యప్పగుడి నుండి ఆత్మకూరు బస్టాండ్ వరకు ట్రంకురోడ్డును వెడల్పు చేయడానికి మూడు రంగులతో, మూడు పాయింట్లలో మార్కింగ్ ఇచ్చారు. మొదటి పాయింట్ వరకు ఖచ్చితంగా తొలగిస్తారు. రెండో పాయింట్ వరకు పరిస్థితినిబట్టి తొలగిస్తారు. మూడోపాయింట్ వరకు బాగా అవసరమనుకుంటే తొలగిస్తారు. ట్రంకురోడ్డు కొన్నిచోట్ల 80అడుగులుంటే ఇంకొన్ని చోట్ల 60అడుగులే వుంది. ఇలా రకరకాల తేడాలున్నాయి. 60అడుగులున్న చోట అటూ ఇటూ ఇరవై అడుగుల లెక్కన తొలగిస్తారు. 80అడుగులు ఉంటే అటు ఇటూ పదేసి అడుగులుపోతుంది. రోడ్డు విస్తరణలో ముందు ప్రభుత్వ భూమి వరకు తీసుకుని ఆ తర్వాత అవసరమైతే ప్రైవేట్ స్థలాలలోకి వెళతారు. అయ్యప్పగుడి నుండి ఆత్మకూరు బస్టాండ్ దాకా ఎక్కడ చూసినా ట్రంకురోడ్డు విశాలంగా ఉండాలనేది ప్లాన్. ఈమేరకే అధికారులు పోలీసు బందోబస్తు మధ్యే మార్కింగ్ ఇచ్చేసారు.

**వ్యాపారుల్లో ఆందోళన:** కార్పొరేషన్ అధికారులిచ్చిన మార్కింగ్‌తో ట్రంకు రోడ్డులో చాలా చోట్ల షాపులే పూర్తిగాపోతున్నాయి. ట్రంకురోడ్డులో 20, 30అడుగుల లోతులో చాలా దుకాణాలున్నాయి. మార్కింగ్ ప్రకారం కొడితే చాలామంది వ్యాపారులు నెత్తిన గుడ్డేసుకోవాల్సిందే! అయితే ట్రంకురోడ్డు విస్తరణవల్ల ముందుండే దుకాణాలు లేచిపోతుండగా, వాటి వెనుకవున్న షాపులు, ఇళ్లులు ఇప్పుడు మెయిన్‌రోడ్డులోకి రానున్నాయి. ట్రంకురోడ్డు విస్తరణ కొందరికి శాపంగా, ఇంకొందరికి వరంగా మారబోతోంది.

**జరుగుతుందా?:** ట్రంకురోడ్డు విస్తరణ జరుగుతుందా? అనే సందేహాలు చాలా మందిలో ఉన్నాయి. కాని ఇప్పుడు జరగకపోతే ఇంకెప్పుడూ ఈ పని సాధ్యం కాదు. ఎందుకంటే ఆనం కుటుంబం ఇప్పుడు అధికారంలో లేదు. ఇద్దరు ఎమ్మెల్యేలుంటే వైకాపా పార్టీ వాళ్లు. ప్రభుత్వం మీద వాళ్లు ఒత్తిడి తెచ్చే పరిస్థితి లేదు. మేయర్ అజీజ్ అధికారపార్టీలో చేరినా ఆయన ప్రభావం నామమాత్రమే. కమిషనర్ చక్రధర్‌బాబు గట్టోడు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేసుకుపోతాడు. ఎస్పీ సెంథిల్‌కుమార్ సమర్ధుడు, ఎలాంటి రాజకీయ ప్రభావాలకు లొంగనిమనిషి. ఖచ్చితంగా రోడ్డు విస్తరణకు ఆయన సహకారం ఉంటుంది. ఇక మున్సిపల్ మంత్రి నారాయణ చూస్తే... ఆయనకు నెల్లూరులో ఓట్లతో పనిలేదు. ఎవరితో పెద్దగా సంబంధాలు లేవు. కాబట్టి మొహమాటాలుండవు. ట్రంకురోడ్డును విస్తరిస్తే సొంతూరును బాగుచేసుకున్నారన్న పేరొస్తుంది. అదే చేయలేకపోతే సొంత కార్పొరేషన్‌లో రోడ్డునే వెడల్పు చేయలేని మంత్రి ఇక రాష్ట్రంలో స్మార్ట్‌సిటీలను ఏం నిర్మిస్తాడనే చెడ్డపేరు వస్తుంది.

ఇక కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుది కీలకపాత్ర. ఆయన ఆదేశాలతోనే ఇక్కడ అధికార యంత్రాంగం కదులుతుంది. వెంకయ్యకు ఇక్కడ అభివృద్ధితో తప్ప ఓట్లతో పనిలేదు. కాబట్టి రోడ్డు విస్తరణకు గట్టిగా పట్టుబట్టాడు. వెంకయ్య నెల్లూరు అభివృద్ధికి సహకరించాలంటే ట్రంకురోడ్డు విస్తరణే దానికి పునాది. ఈ రోడ్డు విస్తరణ సాఫీగా జరిగితే నగరాభివృద్ధికి కావాల్సిన అన్ని హంగులు సమకూర్చడానికి వెంకయ్య నాయుడు సిద్ధంగా ఉన్నాడు. ఏ మాత్రం ఆగిందా... ఇక నెల్లూరు అభివృద్ధి గురించి ఆయన పట్టించుకునే అవకాశాలే లేవు. ఆయన ఇంతకుముందే చెప్పి వున్నాడు.. ప్రజలు సహకరిస్తేనే అభివృద్ధి చేయగలమని... ట్రంకురోడ్డు, ఇతర ప్రధానరోడ్ల విస్తరణలో నగరపౌరులు అధికారులకు సహకరించకపోతే మనం నెల్లూరు అభివృద్ధిని మరచిపోవాల్సిందే!

# రాజుకుంటున్న రాజధాని

(మొదటిపేజీ తరువాయి)

ప్రాధాన్యతనిస్తుంది. రైతుల నుండి భూమిని తీసుకుని అభివృద్ధి చేసిన భూమిలో రైతుకు ఎకరా దామాషాకు వెయ్యిచదరపు గజాల నివాసస్థలం, 100గజాల కమర్షియల్ స్థలం ఇవ్వడానికి ప్రభుత్వం ప్రతిపాదించింది. గజానికి 20వేల రేటు వస్తుందని ప్రభుత్వం లెక్కలేస్తుందిగాని ఇప్పట్లో ఆ రేటు వచ్చేది అసంభవం. రాజధాని కోసం ప్రభుత్వానికి భూమి ఇచ్చేదానికన్నా విడిగా భూములు అమ్ముకుంటేనే రైతుకు లాభం. అదీగాక ఈ రెండు జిల్లాల్లో ఎక్కువశాతం మంది రైతులకు భూములు వదులుకోవాలని లేదు. ఎందుకంటే తరతరాలుగా వారి జీవనాధారం అదే! కాబట్టి ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పోరాటాలకు సిద్ధమవుతున్నారు. ఎంత రేటిచ్చినా భూములు వదులుకోబోమని గ్రామాలకు గ్రామాలే తీర్మానం చేస్తున్నాయి. రైతులే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి దిగుతుండడంతో విపక్షాలు సైతం వారికి అండగా నిలుస్తున్నాయి. ఇప్పటికే వైకాపా, కాంగ్రెస్‌పార్టీ అక్కడ రైతుల పక్షాన పోరాట బాట పట్టాయి. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయిన బీజేపీ కూడా రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కోవడాన్ని వ్యతిరేకిస్తుంది. ఇక వామపక్షాలు సరేసరి... ఇటువంటి పోరాటాలకు వాళ్లెప్పుడూ ముందుంటారు. లోక్‌సత్తాతో పాటు ఇతర పార్టీలు, సామాజిక ఉద్యమకారులు కూడా రైతులకు బాసటగా నిలవడానికి వస్తున్నారు.

చూడబోతే రాజధాని భూముల వ్యవహారం పెద్ద రచ్చ అయ్యేటట్లుంది. రాజధాని నిర్మాణంపై ఒక్క అడుగు కూడా ముందుకుపడే పరిస్థితి లేదు. చౌకగా భూములు లభించే ప్రకాశం, నెల్లూరుజిల్లాలలో రాజధాని పెట్టివుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ప్రభుత్వ భూములు సరిపోకపోతే రైతులే స్వచ్ఛంధంగా భూములివ్వడానికి ముందుకొచ్చేవాళ్లు. ఎందుకంటే ఇక్కడ వ్యవసాయానికంటే రాజధాని వస్తేనే వారికి మేలు. అదే గుంటూరు, కృష్ణా జిల్లాల్లో రైతులకు రాజధాని వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. అదీగాక ఇప్పుడు భూములు వదులుకుంటే ప్రభుత్వం ఇచ్చే స్థలం వారి చేతికొచ్చేదెప్పుడు? దానిని వాళ్లు అమ్ముకునేదెప్పుడు?

ఇవన్నీ చంద్రబాబుకు పట్టడం లేదు. ఆయన మనసులో ఏ ఫీలింగ్ అయితే వుందో ఆ ఫీలింగ్‌తోనే అక్కడ రాజధాని పెట్టాడు. భూముల వివాదంతో రాజధానిపై ముందుకు పోలేరు. చంద్రబాబుకు కావాల్సింది కూడా ఇదే! కాబట్టి ఈ వివాదాలతోనే ఐదేళ్లు గడిపేయొచ్చు.



# రొట్టెలపండుగలో నేతల హల్‌చల్

గల్పిక

అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన సింహపురి నగరం. దర్గామిట్టలోని బారాషహీద్ దర్గా ప్రాంతం. రొట్టెల పండగ సందర్భంగా అక్కడ కోలాహలంగా ఉంది. ఓ పక్క పోలీసులు తుపాకులు పట్టుకుని తిరుగుతున్నారు. ఇంకోపక్క మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ మిషన్లు పట్టుకుని పహారాకాస్తున్నారు. పోలీసు కేంద్రం వద్ద ఓ పోలీస్ మైక్‌లో... 'భక్తులకు విజ్ఞప్తి! దర్గా ప్రాంతంలో జేబుదొంగలు, చైన్‌స్నాచర్లు తిరుగుతున్నారు. మీ అమూల్యమైన వస్తువులు, నగలు జాగ్రత్తగా పెట్టుకోండి... ఇట్లు నెల్లూరు పోలీసు' అని అనౌన్స్ చేస్తున్నారు. ఇంకోపక్క మున్సిపల్ కార్పొరేషన్ సెంటర్ వద్ద ఓ ఉద్యోగి మైక్‌లో... 'భక్తులకు భయంకరమైన హెచ్చరిక! దర్గా ప్రాంతంలో మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు తిరుగుతున్నాయి. అవి ఎక్కడన్నా కనిపించాయంటే మాకు తెలియజేయండి, వెంటనే ఫాగింగ్ మిషన్‌లతో మా సిబ్బంది వచ్చి వాటిని హతమారుస్తారు. ఎవరికైనా దోమలు కరిచినట్టైతే వెంటనే 108కు ఫోన్‌చేయండి, మీ డీజిల్ ఖర్చుతో వారిని ఆసుపత్రికి చేరుస్తాం... అని అనౌన్స్ చేస్తున్నారు. ఆ అనౌన్స్ వింటూ ఓ వ్యక్తి చెరువు వైపు పోతున్నాడు. అతని కంటికి నల్లద్దాలు, ఒంటికి తెల్లగుడ్డలు ఉన్నాయి. అంతలో ఇంకో వ్యక్తి అతని వద్దకొచ్చి సార్, మీరు ఫిల్మ్‌యాక్టరా అని అడిగాడు. వెంటనే మొదటి వ్యక్తి... యాక్టర్‌నే, కానీ ఫిల్మ్‌యాక్టర్‌ను కాదు, పొలిటికల్ యాక్టర్‌ను, నా పేరు స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి. ఈ ఊరికి మాజీఎమ్మెల్యేను అని చెప్పాడు. అప్పుడు అవతల వ్యక్తి... అవునా సార్, మిమ్మల్ని చూసి సినిమా యాక్టరనుకున్నాను. నాలా మిమ్మల్ని చూసి ఎంతమంది పొరపాటు పడ్డారో. అయినా ఇక్కడ దొంగలు తిరుగుతుంటారా? సార్ అని అడిగాడు. వివేకా... అవును, ఇది వాళ్లకు సీజన్, ముఖ్యంగా అపరిచితులను నమ్మొద్దన్నాడు. అప్పుడావ్యక్తి మీరు చెప్పింది నిజమే సార్, అయినా అందరూ మనలా జెంటిల్మెన్స్ ఎందుకుంటారు. నేనుకూడా మీకు అపరిచితుడినే కదా సార్, మీరు నన్ను నమ్ముతారా అని అడిగాడు. దానికి వివేకా.... నోనో యూవార్‌మై ఫ్యాన్ అని భుజం తట్టి చెరువు వద్దకెళ్లాడు. తన వయసు, తన మనసు, తన గ్లామర్ ఎప్పుడూ ఇలాగే కంటిన్యూ కావాలని కోరుకుంటూ ఆయన యవ్వనం రొట్టెను వదిలి గట్టుమీదకొచ్చాడు. అక్కడ చూస్తే అప్పటిదాకా వున్న ఆయన అభిమాని లేడు. వివేకాను చూడగానే ఓ భిక్షగాడు వచ్చి చేయి చాపాడు. వివేకా పర్సు కోసం ప్యాంటు జేబులో చేయిపెట్టాడు. పర్సు లేదు. పక్కనేవున్న పి.ఎ రాజుతో... నా పర్సు ఎవరో కొట్టేసారురా అని అన్నాడు. వెంటనే రాజు... ఇంకెవరు సార్, ఇప్పటి వరకు మీతో పాటు వున్న వ్యక్తే కొట్టేసి ఉంటాడు... అయినా ఎంత క్యాష్ ఉందేంటని అడిగాడు. అందుకు వివేకా... దర్గా దగ్గర బూంది కొనుక్కు తిందామని పదిరూపాయలు పెట్టుకున్నాను. వెధవ పర్సు పోతేపోయింది. దరిద్రం వదిలిందన్నాడు. పర్సు పోతే అంత సంతోషమేంటి సార్ అని రాజు అడిగాడు. నేను అప్పు ఇవ్వాల్సిన వారి పేర్లన్నీ రాసుకున్న చీటీ ఆ పర్సులోనే వుంది. నాకిప్పుడు ఎవరికి అప్పున్నానో గుర్తు కూడా లేదు. ఆ చీటీ కనపడుతుంటే అప్పు ఇవ్వాల్సిన సంగతి గుర్తొస్తుండేది. ఇప్పుడా తలకాయనొప్పి లేకుండా పోయిందన్నాడు. అంతలో అక్కడకు సోమిరెడ్డి వచ్చాడు. ఆయన కూడా రొట్టెను వదిలి ఒడ్డుకు వచ్చాడు. ఏం రొట్టె వదిలావు చంద్రమోహనా అని వివేకా అడిగాడు. మా చంద్రబాబుకు మెమొరీ పవర్ బాగుండాలని కోరుకుంటూ రొట్టెను వదిలానని సోమిరెడ్డి చెప్పాడు. అదేంటి, ఆయనకు మెమొరీ పవర్ బాగుంటే నీకేం లాభమని వివేకా అడిగాడు. దానికి సోమిరెడ్డి, ఏం చెప్పేది వివేకన్నా... మా చంద్రబాబు గతంలో మేం చేసిన కష్టమంతా మర్చిపోయిండు, కేవలం మొన్నటి ఎన్నికలు, ఆ ఎన్నికల్లో డబ్బులు ఖర్చుపెట్టిన వాళ్లు మాత్రమే ఆయనకు గుర్తున్నారు. అందుకే మాకు మా ప్రభుత్వం వచ్చినా ప్రాధాన్యత లేకుండాపోయిందన్నాడు. నువ్వు చంద్రబాబు కొంప ముంచడానికే రొట్టె వదిలినట్లున్నావే అని వివేకా అన్నాడు. ఆ మాటకు సోమిరెడ్డి ఉలిక్కిపడి... అదేంటన్నా అంత మాటన్నావు, నేను చంద్రబాబు కొంప ముంచడమేంటని అడిగాడు. లేకపోతే... చంద్రబాబుకు మెమొరీలాస్ అనేది దేవుడిచ్చిన వరం. అది వుండబట్టే ఆయన గత ఎన్నికల్లో చేసిన ఋణమాఫీ వంటి భీకరమైన వాగ్దానాలను మరచి పోగలిగాడు. అదే నీ రొట్టె ఎఫెక్ట్ పనిచేసి ఆయనకు అవి గుర్తొచ్చాయనుకో... ఇప్పుడు అవన్నీ ఎక్కడ తీర్చగలడు అని వివేకా చెప్పాడు. అప్పుడే అక్కడకు మేయర్ అబ్దుల్ అజీజ్ చేరుకున్నాడు. అతను రొట్టె వదిలి వచ్చాక... భాయ్, మీరేం రొట్టెను వదిలారని సోమిరెడ్డి అడిగాడు. ఓ ఐదు నెలల కాలాన్ని వెనక్కి నెట్టమని కోరుతూ రొట్టెను వదిలానన్నాడు. కాలం ఐదు నెలలు వెనక్కిపోతే నీకేం లాభమని సోమిరెడ్డి అడిగాడు. అందుకు అజీజ్... కాలం ఐదు నెలలు వెనక్కిపోతే... నేను వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటాను. ఆ పార్టీ నుండి బయటకు రాను. బుద్ది లేక తెలుగుదేశంలోకి వచ్చి పడరాని అగచాట్లన్నీ పడుతున్నానని వాపోయాడు. కొద్ది సేపటికి ముదురు దోమల శాఖ మంత్రి పి.నారాయణ వచ్చి రొట్టెను వదిలి వచ్చాడు. మీరేం రొట్టెను వదిలారు సార్ అని అజీజ్ అడిగాడు. దానికి నారాయణ... తుఫాన్‌లు, వరదల రొట్టెను వదిలానన్నాడు. అదేంటి సార్, ఎవరైనా సంతానం, సౌభాగ్యం, ఉద్యోగం వంటి రొట్టెలు వదులుతారు. మీరేంటి తుఫాన్‌లు, వరదల రొట్టె వదిలానంటున్నారని వివేకా ప్రశ్నించాడు. కాకపోతే ఇంకేంటి... రాష్ట్రంలో ఏ పని చేద్దామన్నా నిధులు లేవు, రాజధాని కడదామంటే లోడు ఇసుకకు కూడా చిల్లరలేదు. ఖాళీగా ఉండాల్సిందే! దీనిబదులు తుఫాన్‌లు, వరదలు వచ్చాయంటే మా చంద్రబాబుతో పాటు మంత్రులం అందరూ అక్కడ చేరి కూలిన స్థంభాలను ఎత్తుకుంటూ, విరిగిన చెట్లను తొలగిస్తూ ఏదో పని చేస్తున్నాం అనిపించుకుంటాం కదా అని నారాయణ చెప్పాడు. అతని మాటలకు అందరూ అవాకయ్యారు. అప్పుడే హెలికాప్టర్‌లో హైటెక్ రత్న చంద్రబాబు కూడా అక్కడకు వచ్చాడు. ఆయన రొట్టెను వదిలి వచ్చాక వివేకా వుండి... మీరేం రొట్టెను వదిలారు సార్ అని అడిగాడు. దానికి చంద్రబాబు... ప్రజలకు మతిమరుపు రావాలని కోరుకుంటూ రొట్టెను వదిలానన్నాడు. వివేకా అవాక్కై... అదేంటి, మీ సోమిరెడ్డేమో మీకు మెమొరీ రావాలని కోరుతూ రొట్టె వదిలితే... మీరేమో ప్రజలకు మెమొరీ లాస్ అవ్వాలని కోరుకుంటున్నారని వివేకా ప్రశ్నించాడు. వాళ్లకు మతిమరుపు వస్తేనే కదా నేను చేసిన హామీలన్నీ మరచిపోయేదంటూ చంద్రబాబు నేరుగా హెలికాప్టర్ వద్దకెళ్లాడు. పది నిముషాల తర్వాత గండరగండ, తెలంగాణ సీఎం కేసీఆర్ వచ్చి రొట్టెను వదిలాడు. ఆయన బయటకొచ్చాక మీరేం కోరుకున్నారన్నా అని సోమిరెడ్డి అడిగాడు. మా తెలంగాణలోనే కాదు ఏపిలో కూడా కరెంట్ ఉండకూడదని ప్రార్థించానని కేసీఆర్ అన్నాడు. అదేంటి మీ కన్ను పోయిందని, మా కన్ను పోవాలా అని వివేకా అడిగాడు. రాష్ట్ర విభజనతో తెలంగాణ ఒక్కటే నష్టపోయిందనే పేరెందుకు రావాలి. ఏపి కూడా నష్టపోవాలి... అని కేసీఆర్ చెప్పాడు. నీలాంటి దుర్మార్గులు రాష్ట్రానికొకరుంటే దేశాన్ని అమ్ముకోవాల్సి వస్తుందని మనసులో అనుకుని వివేకా, సోమిరెడ్డిలు అక్కడ నుండి బయలుదేరారు.

## కదంబం

### కిటికీ

**- సి.హెచ్.వి.బృందావనరావు,**
**విజయవాడ. 9963399189.**

గాలికొట్టుకొని
ఒక్కసారి ఆ వాతాయనం
అలా తెరచుకోగానే
ఎన్నెన్ని జ్ఞాపకాలో
గాలిపెరలై ముఖం నిండా కమ్ముకుని
ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.
నెమ్మదిగా, చప్పళ్లేకుండా
కొట్టుకుంటున్న కనెప్పలు
కనుపాపల్నించి
ఏ పురా రహస్యాలను
దాచిపెట్టాలనుకుంటున్నాయోగాని
కన్నూపులో మాత్రం సందు చేసుకుని
స్మృతి కిరణాల వెలుగురెకల్ను
సంధిస్తూనే ఉంటాయి.
ఏ రెండు వెచ్చని తడిపెదాలో వచ్చి
కనెప్పలను ముద్దాడి
ఇంత ఊపిరి పరిమళాన్ని
ముఖం నిండా వొంపిన విప్పలు
మావిచిగుర్ల గుబుర్ల గాలి మీంచొచ్చి
బతుకులోకి జొరబడుతూనే ఉంటాయి.
ప్రభాత తుషారయవనికల
సంశయాలోచనలను
నిశ్శబ్దంగా మాయం చేసే
లేయెండ కిరణాలు
నెత్తురెదురెక్కుతున్న ఎడద మీద
అలముకుంటూనే ఉంటాయి.
కొబ్బరాకుల్లో చిక్కుపడ్డ నెలవంకను
విడిపించే ప్రయాసలో
గాలి శిల్పించే వర్ణచిత్రాలు -
చరణముంచిన చోటనల్లా
చెలియచూపులై పరచుకొని
ఎన్ని యుగాల కిందనో
నిజంగా బ్రతికిన క్షణాలను
పట్టకం లోలా పట్టిచూపే
హరివింటి వర్ణాలవుతాయి.
గడిచిపోయిన ఆ జీవక్షణాల బరువుతో
కాలం నెమ్మదిగా
కుంగిపోతూనే ఉంటుంది.

## ముత్యాల పందిరిలో శ్రీవారి నగరోత్సవం



కార్తీకమాసం చిలకద్వాదశిని పురస్కరించుకొని శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి ముత్యాలపందిరి వాహనంలో సోమవారం నెల్లూరు పురవీధుల్లో వైభవంగా నగరోత్సవం జరిగింది. మేళతాళాలతో మంగళవాయిద్యాలతో, బాణాసంచాలతో అన్నమయ్య కీర్తనలు, కోలాటాలు, మహిళాభక్తుల కార్తీకదీపారాధనలతో నగరోత్సవం కనులపండువగా సాగింది. వేదపండితులు వేదగిరి ఫణిశర్మ నేతృత్వంలో స్వామివారికి తిరువారాధనల అనంతరం నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పుల వీధిలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నుండి నగరోత్సవాన్ని ప్రారంభించారు. నగర పురవీధుల్లో భక్తులు, స్థానికులు శ్రీ స్వామివారిని దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. సింహపురి గోవిందమాల ధారణ కమిటి, కనకదుర్గా సేవాసమితి కొలపర్తి రమేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం వరకు నగరోత్సవం సాగింది. ఉత్సవ నిర్వాహణకర్తల్లో ముఖ్యులు కొలపర్తి రమేష్‌బాబు మాట్లాడుతూ నెల్లూరులో భక్తులకు తిరుమలలో శ్రీనివాసునికి జరిగే ఉత్సవాలను కనులారా వీక్షించే భాగ్యాన్ని కలుగజేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. తొలుత అశ్వవాహనం, కల్పవృక్ష వాహనాలపై స్వామివారి నగరోత్సవాలను నిర్వహించామని, ఈసారి ముత్యాల పందిరి వాహనసేవను భక్తులు వీక్షించే అవకాశం కల్పించామన్నారు.

## తుమ్మలపెంట వద్ద పర్యాటక కేంద్రం

నెల్లూరుజిల్లా కావలి మండలం, తుమ్మలపెంట వద్ద పర్యాటక కేంద్రం పనులు అన్ని హంగులతో సిద్ధమైంది. రూ.5.15కోట్లతో నిర్మాణం పనులు పూర్తి చేశారు. నిర్మించిన రిసార్టును ఇటీవల పర్యాటకశాఖ కమిషనర్ చందనాఖాన్ పరిశీలించారు. ఈ కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర మునిసిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. సముద్రానికి వందమీటర్ల దూరంలో 12గదులలో రిసార్టు నిర్మించారు. ఇక్కడే బాల్కనీలో కూర్చుని సముద్రతీరాలను, అలలను వీక్షించే ప్రత్యేకమైన కుర్చీలు ఏర్పాటు చేశారు. పర్యాటకుల కోసం రెస్టారెంట్లు ఏర్పాటు చేశారు. చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. సముద్రంలో బోటుషికారు కోసం మోటారు పడవను సిద్ధం చేశారు.

## ఢిల్లీలో ఆశ్రితారెడ్డి నృత్యప్రదర్శన

జాతీయ బాలభవన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే బాలల దినోత్సవ వేడుకలలో నెల్లూరుకు చెందిన ఆశ్రితారెడ్డి నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పలువురు కేంద్రమంత్రులు కూడా పాల్గొంటారు. తన నాట్య ప్రతిభను జాతీయవేదికపై ప్రదర్శించనున్న ఆశ్రితారెడ్డికి నెల్లూరు బాలభవన్ డైరక్టర్ సుభద్రాదేవి అభినందనలు తెలిపారు.

### కనులపండువగా
## బంగారు గరుడోత్సవం

నెల్లూరు రంగనాథస్వామి దేవస్థానంలో మంగళవారం చిలుక ద్వాదశిని పురస్కరించుకుని బంగారు గరుడోత్సవం వైభవంగా జరిగింది. బంగారు గరుడ వాహనంపై రంగనాథస్వామిని దర్శించుకుని భక్తులు తరించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఆలయ ప్రధానార్చకులు కె.జగన్నాధాచార్యులు పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**సవరణ:**

తేది.31.10.14 సంచికలో 11వ పేజీలో '2వ రాధేయ స్మారక పురస్కారం' వార్తను '2వ రాధేయ పురస్కారం'గా సవరించుకోగలరని పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

# శ్రద్ధాంజలి



## కీ॥శే॥ శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ గారు

అక్టోబర్ 30 గురువారం, 2014 నాడు స్వర్గస్తురాలైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.

అందరి హృదయాలలో సుస్థిరస్థాన మేర్పరచుకుని,
నిండునూరేళ్ళు పరిపూర్ణ జీవితాన్ని సాగించిన ప్రేమానురాగాలదీప్తి,
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ...

**పెద్దకర్మ:** తేది 13-11-2014 గురువారము ఉదయం గం.11-00లకు
కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం, నెల్లూరు జిల్లా నందు జరుగును.
బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు తెలియజేయడమైనది.

**కుమారులు - కోడళ్ళు**
గునుపాటి వెంకటకృష్ణారెడ్డి - ఇందిరమ్మ
గునుపాటి జనార్ధన్‌రెడ్డి - సునీతమ్మ
గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి - శుభప్రదమ్మ

**కుమార్తెలు - అల్లుళ్ళు**
కోటిరెడ్డి, నిర్మలమ్మ - కీ॥శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి
అత్తివరపు విమలమ్మ - అత్తివరపు రామచంద్రారెడ్డి
దొడ్ల లలితమ్మ - దొడ్ల పద్మనాభారెడ్డి

**మరియు మనుమలు, మనుమరాళ్ళు ముదిమనుమలు, ముదిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com